# గృహ నిర్మాణ శాఖ పనితీరుపై జిల్లా కలెక్టర్ అంకిత్ సమీక్ష

భద్రాద్రి కొత్తగూడెం/ కొత్తగూడెం/ మార్చ్ 12/ అక్షరం న్యూస్ –:

జిల్లాలో అమలు జరుగుతున్న గృహ నిర్మాణ కార్యక్రమాల పురోగతిపై జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జిల్లాలో మంజూరైన ఇళ్ల సంఖ్య, ఇప్పటికే గ్రౌండింగ్ పూర్తయిన ఇళ్ల వివరాలు, స్లాబ్ లెవల్‌కు చేరుకున్న ఇళ్ల స్థితి, ఇంకా నిర్మాణం ప్రారంభం కాని లేదా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల నిర్మాణం వేగవంతం అయ్యేలా అధికారులు క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రౌండింగ్ పూర్తైన ఇళ్లను త్వరితగతిన తదుపరి దశలకు తీసుకెళ్లి స్లాబ్ లెవల్ వరకు పనులు పూర్తి చేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్లకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించి నిర్మాణాలను ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పురోగతిపై కూడా కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాన్ని నిర్దేశిత కాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకాల ద్వారా అర్హులైన ప్రతి [illegible] కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే లక్ష్యమని, అందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు . సమాసంలో హౌసింగ్ పీడీ రవీంద్రనాథ్, గృహ నిర్మాణ శాఖ ఏఈలు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.







## పాఠశాలల సమీపంలోని చిరుతిండి దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి

- **జిల్లా కలెక్టర్ అంకిత్.**

భద్రాద్రి కొత్తగూడెం/ కొత్తగూడెం/ మార్చ్ 12/ అక్షరం న్యూస్ – :జిల్లాలోని బీసీ, ఎస్సీ, మైనారిటీ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, ఏకలవ్య పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యతపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసి కార్యాలయంలో సంబంధిత జిల్లా అధికారులు, ఆహార భద్రత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇకపై కలుషిత ఆహార ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం పరిశుభ్రంగా, నాణ్యంగా ఉండేలా ప్రత్యేక కార్యాచరణతో నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని తెలిపారు. ఆహారం కలుషితం కావడానికి గల కారణాలను ఆహార భద్రత అధికారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలలు, వసతి గృహాల సమీప ప్రాంతాల్లో ఉన్న చిరు తిండ్ల దుకాణాలు, ఐస్‌క్రీమ్ బండ్లు మరియు ఇతర ఆహార విక్రయ కేంద్రాలపై ఆహార భద్రత అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. విక్రయించే ఆహార పదార్థాల గడువు తేదీలు, నాణ్యత, నిల్వ విధానాలను క్రమం తప్పకుండా పరిశీలించాలని సూచించారు. నాణ్యత లేని లేదా గడువు ముగిసిన ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పాఠశాలలకు బయట నుండి ఆహార పదార్థాలు తీసుకురావడం అనుమతించరాదని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా పాఠశాలల వంటగదులు, భోజనశాలలు పరిశుభ్రంగా ఉండేలా సంబంధిత అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఓ సంజీవరావు, బీసీ సంక్షేమ అధికారి విజయలక్ష్మి, ఎస్సీ సంక్షేమ అధికారి శ్రీలత, ఆహార భద్రత అధికారి శరత్, ఆర్‌సీఓలు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఈ లోకం.. వింతలా మారనుందా?!



మనిషి గొప్పా? మనిషి సృష్టించిన యంత్రం గొప్పా? దినదినాభివృద్ధి చెందుతున్న సాంకేతికత.. ప్రపంచాన్ని ఎక్కడికో తీసుకెళ్తున్నది. సరికొత్త ఆవిష్కరణలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. కలలో కూడా ఊహించనంత వేగంగా సాగుతున్న ఈ పరుగు.. మనిషి ఉనికినే సవాల్ చేస్తున్నది. భవిష్యత్తుపై భయాందోళనలు రేపుతున్నది. మరి రాబోయే దశాబ్దం ఎలా ఉండబోతున్నది? అడుగడుగునా రోబోలు, అంతరిక్షంలో సర్వర్లు, చంద్రునిపై నగరాలు, మార్స్‌పై మానవ స్థావరాలు.. ఇలా ఎన్నెన్నో ఊహించని అద్భుతాలు కళ్ల ముందు సాక్షాత్కరించబోతున్నాయి.

2035 నాటికి మానవులు నిర్ణయాలు తీసుకోవడం మానేసి ఏఐ వ్యవస్థలు నిర్ణయం తీసుకుంటాయి. డేటా, ఏఐ వ్యవస్థలు మనుషుల కంటే ఎక్కువ శక్తిమంతంగా తయారవుతాయి.– యువల్ నోవా హరారీ, ప్రఖ్యాత చరిత్రకారుడు, రచయిత నేడు మన జీవితంలో ఒక భాగంగా మారిన అనేక అంశాలు ఒకప్పుడు ఊహకు కూడా అందనివి అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. కంప్యూటర్, ఒక జీపీఎస్, ఒక ఫోన్ మన జేబుల్లో ఇమిడిపోతున్నాయి. చేతి వేళ్ల కొసన సమాచారం అందుబాటులోకి వచ్చింది. ఇంటర్నెట్ కారణంగా ఇంటర్నేషనల్ గ్లోబల్ కనెక్టివిటీ సాధ్యం అవుతున్నది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ మన సామాజిక సంబంధాలను పునర్నిర్వచించాయి. నెట్‌ఫ్లిక్స్, ప్రైమ్ లాంటివి మన వినోద ప్రపంచాన్ని మార్చేశాయి. దైనందిన జీవితంలో అవసరమైన వస్తువులే కాదు. కోరుకున్న రుచులూ గుమ్మం ముందుకు వచ్చేస్తున్నాయి. కరెన్సీతో పనిలేకుండా లావాదేవీలు సులువుగా ఆన్‌లైన్‌లో పూర్తయిపోతున్నాయి. రిటైల్, షాపింగ్ అలవాట్లను ఈ–కామర్స్ రంగం సమూలంగా మార్చివేసింది. అంతేనా? విమానయానం ద్వారా కొన్ని గంటల్లోనే ఖండాంతరాలను దాటడం సాధ్యం అవుతున్నది. కమ్యూనికేషన్ వ్యవస్థను వాట్సాప్, ఫేస్‌బుక్, జూమ్ సులభతరం చేశాయి. గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీల మార్పిడి తేలికైపోయింది. జెనెటిక్ ఎడిటింగ్ ద్వారా వ్యాధులకు చికిత్స చేస్తున్నారు. ఒకప్పుడు ప్రాణాంతక వ్యాధులుగా చెప్పుకొనే జబ్బులు ఇప్పుడు చికిత్సకు లొంగుతున్నాయి. ఇదంతా మానవ మేధస్సు సాధించిన ఘనత. సాంకేతికత ప్రసాదించిన వరం.

ఇంతింతై.. వటుడింతై అన్న చందంగా ఈ సాంకేతికత.. అదే కృత్రిమమేధ ఆకాశమంత ఎదుగుతున్నది. ఒకరకంగా అన్ని రంగాల్లోనూ విజృంభిస్తున్నది. వాషింగ్టన్ పోస్టు పత్రిక 1908 జనవరి 12న 'అమెరికా భవిష్యత్తు' పేరుతో ఒక పూర్తి పేజీ కథనాన్ని ప్రచురించింది. ఆలోచనాపరులుగా గుర్తింపు తెచ్చుకున్న కొందరు వ్యక్తుల అభిప్రాయాలు సేకరించింది. వాళ్లలో ప్రఖ్యాత శాస్త్రవేత్త థామస్ ఆల్వా ఎడిసన్ కూడా ఉన్నారు. 'కొత్త ఆవిష్కరణలకు కాలం చెల్లినట్టేనా?' అని సంపాదకులు ఎడిసన్‌ని అడిగారు. ఆ ప్రశ్నకు ఆయన విస్తుపోయాడు. "ముగిసిపోవటమా? ఇంకా అసలు ప్రారంభమే కాలేదు" అన్నాడు నవ్వుతూ! " ఈ సమాధానం సరిపోతుందా? ఇంకేమైనా కావాలనుకుంటే అడగండి". "వచ్చే 50 ఏళ్లలో... గత అర్ధ శతాబ్దంలో మాదిరిగా యాంత్రిక, శాస్త్రీయ అభివృద్ధి సాధ్యం అవుతుందని మీరు విశ్వసిస్తున్నారా? "అవును. కచ్చితంగా. గొప్పగా.. చాలా ఉన్నతంగా..." " ఏ లైన్‌లో..?" "అన్ని రంగాల్లో.. ఒకటని ఏముంది?" తాపీగా చెప్పాడు ఎడిసన్. గుడ్డిగా, కేవలం ఆత్మవిశ్వాసంతో చెప్పిన మాటలు కావవి. శాస్త్రీయ ఆవిష్కరణలు ఎలా చోటుచేసుకుంటాయనే అంశంపైన ఎడిసన్‌కి స్పష్టత ఉంది. 118 ఏళ్ల క్రితంతో పోలిస్తే ప్రపంచం ఊహించనంతగా మారిపోయింది. ఇది కల్పన కాదు. కళ్ల ఎదుట కనిపిస్తున్న వాస్తవం.

### శతాబ్ది ఆవిష్కరణలు

1900–1925 మధ్య అంటే మొదటి పాతికేళ్లలో వచ్చిన ముఖ్యమైన ఆవిష్కరణల గురించి చెప్పాలంటే.. రైట్ సోదరులు విమానాన్ని కనిపెట్టింది ఈ కాలంలోనే! మొట్టమొదటి వైర్‌లైస్ టెలిగ్రాఫ్, మార్కోని రేడియోను కనుగొన్నది, అందరికీ కార్లు అందుబాటులోకి తేవడానికి హెన్రీఫోర్డ్ అసెంబ్లీ లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది.. డయాబెటిస్‌కి ఇన్సులిన్ కనుగొన్నది ఈ కాలంలోనే. టెక్నాలజీ పరంగా రేడియో, కంప్యూటర్‌లకు సంబంధించిన వాక్యూమ్ ట్యూబ్‌లను కూడా ఈ సమయంలోనే అభివృద్ధి చేశారు. 1925–50 నడుమ కమర్షియల్ ఎయిర్ ట్రావెల్ అనేది విస్తరించింది. మొట్టమొదటి కంప్యూటర్ వ్యవస్థ ఇనియాక్‌ని వృద్ధి చేశారు. వైద్యరంగంలో పెన్సిలిన్‌ని కనుగొన్నారు. అలాగే 1940 తర్వాత టెలివిజన్ అనేది పాపులర్ మీడియాగా వృద్ధి చెందడం మొదలైంది. అణురియాక్టర్‌ని, ఆటంబాంబుని కనుగొన్నారు. 1950–75 మధ్యలో... 1969లో మొట్టమొదటిసారి మానవుడు చంద్రునిపైన అడుగుపెట్టాడు. మైక్రో ప్రాసెసర్లు, పర్సనల్ కంప్యూటర్లు ప్రారంభమయ్యాయి. ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్, ఎంఆర్ఐ మిషిన్లు అభివృద్ధి చేశారు. శాటిలైట్ కమ్యూనికేషన్, మొబైల్ ఫోన్లు పుట్టుకొచ్చాయి. 1975–2000లో ఇంటర్నెట్, వరల్డ్ వైడ్ వెబ్ వృద్ధి చెందటం కీలక పరిణామం. బయోటెక్నాలజీ పరంగా జెనెటిక్ ఇంజినీరింగ్, క్లోనింగ్ వృద్ధి చెందింది. ఇంధన రంగంలోకి సోలార్ ప్యానెళ్లు, విండ్ టర్బైన్లు వచ్చి పడ్డాయి. మొబైల్ ఫోన్లు, ఈమెయిళ్లు అవసరాలుగా మారటం మొదలైంది. వైద్యరంగంలో జీన్ థెరపీ, స్టెమ్ సెల్ రీసెర్చి క్రియాశీలంగా మారాయి. 2000–2025 మధ్య మునుపెన్నడూ లేనంతగా సాంకేతికత పరుగులు తీసింది. స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా, క్లౌడ్ కంప్యూటింగ్‌లకు ప్రాధాన్యం పెరిగింది. బయోటెక్నాలజీలో జీన్ ఎడిటింగ్ ముందుకొచ్చింది. విద్యుత్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనం మీద దృష్టి పెరిగింది. వైద్యరంగంలో క్యాన్సర్ నివారణ చికిత్సల్లో ఇమ్యునోథెరపీ లాంటి అధునాతన పద్ధతులు ప్రవేశించాయి. అంతరిక్ష శోధనలో స్పేస్ ఎక్స్ లాంటి ప్రైవేట్ కంపెనీలు ప్రవేశించాయి. నాసా, ఇస్రోలాంటి ప్రభుత్వ సంస్థలకు దీటుగా భవిష్యత్‌లో ప్రపంచానికి కొత్త ఆవిష్కరణలను పరిచయం చేస్తామని చెబుతున్నాయి. భవిష్యత్తులో తలెత్తే అన్ని పరిణామాలను అంచనా వేయటం ఎవరికైనా సాధ్యం కాని పని. ఒకప్పుడు తుఫాన్‌లు, భూకంపాలు, సునామీలను అంచనా వేయటం వీలయ్యేది కాదు. ఇప్పుడు శాస్త్రీయ పరిశోధనల పుణ్యమా అని చాలా విషయాలను మనం ముందుగానే తెలుసుకోగలుగుతున్నాం. తగిన సమయంలో హెచ్చరికలు జారీ చేస్తున్నాం. వాటి ఆధారంగా మనం స్పందిస్తున్నామా లేదా అనేది వేరే విషయం. కరోనా లాంటి విపత్తులు, స్టాక్ మార్కెట్ సంక్షోభాలు, దేశాల మధ్య యుద్ధాలు ఇవి ఊహించటానికి సాధ్యం కానివి. వాటిని అప్పటికప్పుడు ఎదుర్కొని తీరవలసిందే. కాకపోతే వాటికి సంబంధించిన ముందస్తు హెచ్చరికలు వస్తాయి. అవి ఉత్పాతంగా మారి మన ముందు ప్రత్యక్షమయ్యే వరకూ అంతగా పట్టించుకోం. ఇవి మనకు సంబంధించని వ్యవహారాలుగానే చూస్తాం. వైరస్‌లు వస్తూ ఉంటాయి.. పోతూ ఉంటాయి. అదేమంత పెద్ద విషయం కాదని అనుకుంటాం. ఇతర దేశాల్లో మరణాలు సంభవిస్తున్నాయని ప్రభుత్వాలు, ప్రజలు కూడా లెక్కచేయరు. మానవుల అంచనాలకు అందనంత వేగంగా వైరస్ విరుచుకుపడి తన ప్రతాపాన్ని చూపిస్తున్నప్పుడు నిస్సహాయంగా తలొంచుకోవలసిన పరిస్థితి ఎదురవుతుంది.

స్టాక్ మార్కెట్ హెచ్చుతగ్గులు, ద్రవ్యోల్బణం, రూపాయి విలువ పడిపోవటం లాంటి వాటితో వచ్చే నష్టం ఏముంది అనుకుంటాం? అదేదో దేశంలో యుద్ధాలు, దేశాల మధ్య కీచులాటలు.. ఇవన్నీ మనకేం సంబంధం అనుకుంటాం. స్టాక్ మార్కెట్లు దెబ్బతింటే బాస్‌లు తమ పొదుపు సొమ్మును కోల్పోతారు. దాంతో తమ దగ్గర పనిచేసే ఉద్యోగులను తొలగించి బయటికి పంపుతారు. ఆ ఉద్యోగులు రోడ్డున పడతారు. బ్యాంకులకు చెల్లించవలసిన అప్పులు బకాయి పడతారు. పొదుపు చేయటం తగ్గుతుంది. బ్యాంకుల్లో పొదుపు సొమ్ము తగ్గితే అవి రుణాలు ఇవ్వటం తగ్గిస్తాయి. ప్రజలు తగినంత డబ్బు లేకపోతే కొనుగోళ్లు తగ్గిస్తారు. దాని ప్రభావం వ్యాపారాలపైనా పడుతుంది. వ్యాపారాలు తగ్గటం వల్ల కూడా బ్యాంకులు దెబ్బతింటాయి. బ్యాంకులు నష్టపోవటం వల్ల ప్రజలు పొదుపు చేయలేకపోతారు. ఇది గొలుసుకట్టులా సాగుతూనే ఉంటుంది. ఓ వైపు ధరలు పెరుగుతూ, ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతనాలు పెరగక, జీవిక భారంగా తయారవుతున్నప్పుడు 'బేర్'మంటాం. చాలా పరిణామాలు ప్రారంభంలో చాలా చిన్నవిగానే కనిపిస్తాయి. వాటిని సరిగ్గా అంచనా వేసి, స్పందిస్తే నష్టం తక్కువగా ఉంటుంది. విస్మరిస్తేనే పెద్ద విపత్తుగా మారుతుంది. కొవిడ్ 19 విషయాన్నే చూద్దాం. ఒక వైరస్ మానవ శరీరంలోకి ప్రవేశించింది. అది ఎప్పుడూ చోటు చేసుకునే అంశం. ఆ వ్యక్తులు మరికొందరిని కలిశారు. ఇది కూడా సాధారణ అంశమే. అలా కొన్ని రోజులు గడిచాయి. కానీ, అది ప్రమాదకరమని గ్రహించాక ఆంక్షలు విధించడం మొదలైంది. మొదట్లో తేలిగ్గా తీసుకున్నాం. ఇతర దేశాల్లో కూడా అదే పరిస్థితి ఉంటుందని భావించాం. ప్రామాణికమైన తిరస్కరణ ఇది. దానితో తగినంత వేగంగా చర్యలు తీసుకోవటానికి అధికార యంత్రాంగం సిద్ధపడలేదు. అతి ఆశావాదంతో వ్యవహరించాం. ఏం చేయాలనే భయాందోళనల మధ్య నిర్బంధంగా లాక్‌డౌన్ విధిస్తే గానీ పరిష్కారాలు కనుగొనటం సాధ్యం కాలేదు. ఇది ఏ ఒక్క దేశానికో పరిమితమైన అంశం కాదు. యావత్ ప్రపంచం నేర్చుకోవలసిన పాఠం అని గుర్తించారు. మానవుల ఆలోచనా సరళిలో, జీవన విధానంలో మార్పు తెచ్చిన అతిపెద్ద అంశం ఏదైనా ఉందీ అంటే అది కరోనా అని చెప్పుకోక, ఒప్పుకోక తప్పదు.

### గతంలోనే.. ఫ్యూచర్ షాక్

ఆల్విన్ టోఫ్లర్ 1970లో తన 'ఫ్యూచర్ షాక్' పుస్తకంలో భవిష్యత్తు గురించి, సమాజం గురించి అనేక ఆసక్తికరమైన అంచనాలను రూపొందించారు. అవి అప్పట్లో వింతగా అనిపించినా మన జీవితంలో భాగంగా మారాయి. సమాచార విస్ఫోటనం: సమాచార లభ్యత వల్ల మనిషి నిర్ణయాలు తీసుకోవటంలో తడబడతాడని, దీనివల్ల మానసిక ఒత్తిడి పెరుగుతుందని అంచనా వేశారు. నాలెడ్జ్ ఎకానమీ: భవిష్యత్తులో శారీరక శ్రమ కంటే జ్ఞానం, సమాచారం, డేటా ఆధారిత ఆర్థిక వ్యవస్థలే రాజ్యమేలతాయని ఆయన ఊహించారు. ప్రొజ్యూమర్స్: వినియోగదారులు కేవలం వస్తువులను కొనటమే కాకుండా తమకు కావలసిన వస్తువులను డిజైన్ చేయటంలో లేదా ఉత్పత్తి చేయటంలో భాగస్వాములు అవుతారని పేర్కొన్నారు. నేడు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో సాగుతున్న కంటెంట్ క్రియేషన్ దీనికి మంచి ఉదాహరణ.

### నోస్ట్రడామస్ జోస్యం

మైఖేల్ డి నోస్ట్రడామస్ 16వ శతాబ్దానికి చెందిన ప్రముఖ ఫ్రెంచి జ్యోతిషుడు. భవిష్యత్తును అంచనా వేయడంలో ఉద్దండుడిగా ప్రపంచ దేశాలు ఇతణ్ని కీర్తిస్తుంటాయి. ఆయన రాసిన పుస్తకం 'లెస్ ప్రొఫెటీస్' (ది ప్రొఫెసీస్). ఇందులో నోస్ట్రడామస్ పేర్కొన్న ఎన్నో విషయాలు నిజమయ్యాయని చెబుతుంటారు. ప్రధానంగా ఐరోపాలో అడాల్ఫ్ హిట్లర్ ఆధిపత్యం, ప్రపంచ యుద్ధం, సెప్టెంబరు 11న ఉగ్రదాడులు, కొవిడ్ 19 మహమ్మారి వంటి అంశాలను పేర్కొంటారు. హెన్రీ 2 మరణం, లండన్‌లో అగ్ని ప్రమాదం, ఫ్రెంచి విప్లవం గురించి కూడా ఆయన ముందుగానే చెప్పారని అంటారు. ఆయన రచనలు కావ్యరూపంలో ఉంటాయి. ఆ క్వాంట్రెయిన్స్ (పద్యాలు)ను అర్థం చేసుకోవటం కష్టం అన్న అభిప్రాయం కూడా ఉంది. కీలక పరిణామాలు చోటుచేసుకున్నప్పుడు నోస్ట్రడామస్ ఏం చెప్పాడా? అనేది పరిశీలించడం, వాటిపైన విశ్లేషణలు రావడం పరిపాటిగా మారింది. ప్రతి సంవత్సరం ఆరంభంలో మీడియా నోస్ట్రడామస్‌ను గుర్తు చేసుకుంటుంది. 2025లో ఓ పెద్ద గ్రహశకలం భూమిని ఢీ కొట్టవచ్చని, లేదా అత్యంత ప్రమాదకరంగా సమీపానికి రావచ్చని, దీర్ఘకాలిక యుద్ధానికి తెరపడుతుందని, బ్రెజిల్‌లో వరదలు, అగ్నిపర్వతాలు వంటివి బద్దలవుతాయని అంచానా వేసినట్టుగా చెప్పారు. ఇందులో ఏవి నిజమయ్యాయి? ఏవి కాలేదు అనేది ఎవరికి వారు విశ్లేషించుకోవల్సిందే!

### పదేళ్ల తర్వాత ...

2036లో ప్రపంచం ఏ విధంగా మార్పు చెందుతుందనేది ఆసక్తికరమైన అంశం. ఇది ఏఐ ప్రపంచం. ఆటోమేషన్ సమాజం. సాంకేతిక విప్లవం మునుపెన్నడూ లేనంత విధంగా పరిణామాలను మార్చి వేస్తున్నది. రాబోయే రోజుల్లో యాప్‌ల





వాడకం తగ్గి మనం కోరిన పనులు చేసిపెట్టే ఏఐ ఏజెంట్లు ప్రాచుర్యంలోకి వస్తాయి. ఇవి సాఫ్ట్‌వేర్‌తో నేరుగా సంభాషించి పనులను పూర్తి చేస్తాయి. రవాణా, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో రోబోల వాడకం విపరీతంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు చంద్రుడి మీద నగరాలు, అంగారకుడిపైన మానవ స్థావరాలను ఏర్పాటు చేయడానికి ప్రస్తుత అంతర్జాతీయ సంస్థలు, ప్రైవేట్ కంపెనీలు వేగంగా అడుగులు వేస్తున్నాయి. చంద్రుడి దక్షిణ ధ్రువం దగ్గర బేస్ క్యాంప్ ఏర్పాటు చేయాలని నాసా లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే రాబోయే పదేళ్లలో అక్కడ స్వయంగా అభివృద్ధి చెందే నగరాన్ని ఏర్పాటు చేయాలని స్పేస్ ఎక్స్ ప్రయత్నిస్తున్నది. 2047 నాటికి చంద్రుని మీద క్రూ స్టేషన్ నిర్మించాలని ఇస్రో సిద్ధం అవుతున్నది. అక్కడ ఖనిజాల వెలికితీత చేపట్టాలని భావిస్తున్నది. ఇప్పటి వరకు చాట్ జీపీటీ, చాట్ బాట్లు, క్లౌడ్ సర్వర్లు మాత్రమే చూశాం. రాబోయే రోజుల్లో భూమికి అల్లంత దూరాన సర్వర్లను ఏర్పాటు చేస్తారు. విద్యుత్తు ఖర్చు లేకుండా సోలార్ ఎనర్జీని వాడుకుంటారు. 2036 నాటికి మనుషుల కంటే తెలివిగా పనిచేసే స్థాయికి ఏఐ చేరుకుంటుందని అట్లాంటిక్ కౌన్సిల్ లాంటి సంస్థల ప్రకటనలు ప్రపంచంలో కలవరం రేపుతున్నాయి. ఇప్పటికే టెక్నాలజీ అంటే జనాల్లో భయం పెరిగిపోయింది. మన రోజువారీ పనులను, ఉత్పత్తిని ఏఐ సాయంతో యంత్రాలే చేసేస్తుంటే అవి తమ ఉపాధిని మింగేస్తున్నాయన్న భయాందోళనలు పెరిగిపోయాయి.

### మారాల్సిందేనా..

విద్య, వైద్యం, వ్యవసాయం, న్యాయశాఖ ఇలా ఏ రంగంలో చూసినా ఏఐ కారణంగా విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటాయనేది వాస్తవం. ఉద్యోగాల స్వరూప స్వభావాలను ఏఐ, ఆటోమేషన్ మార్చివేస్తాయి. కొత్త నైపుణ్యాలతో సిద్ధం అయ్యారా సరే, లేకపోతే ఇంటికే అన్న సందేశాన్ని బలవంతంగా అందిస్తాయి. నిజంగా ఇది ఉద్యోగులకు సవాలుగా నిలిచే అంశమే. కంప్యూటర్ వచ్చిన కొత్తలో దాని వల్ల ఉద్యోగాలు పోతాయనే కలవరం, భయం చాలామందిలో ఉండేది. ఇప్పుడు ఏఐ విషయంలోనూ అంతే. కంప్యూటర్లకు అలవాటు పడిన తర్వాత సమాజం ఎంత వేగంగా పరివర్తన చెందిందో, పనిలో వేగం, సౌకర్యం పెరిగాయో అంతకంటే వేగంగా ఈ కొత్త సాంకేతికత తోడ్పడుతుంది. దానిని ఓ స్నేహితునిలా స్వీకరించాలి. పెంపుడు జంతువులా మచ్చిక చేసుకోవాలి. ఓ ప్రియురాలి మాదిరిగా గాఢమైన ఆర్తిని ప్రదర్శించాలి. ఓ జీవిత భాగస్వామిగా సహజీవనం చేయాలి. అప్పుడే ఆశించిన ప్రయోజనం నెరవేరుతుంది.

### వైద్యరంగంలోనూ..

వైద్యరంగంలోనూ విప్లవాత్మక మార్పులు సంభవిస్తాయి. కేవలం మన శరీరాన్ని పరీక్షించి మాత్రమే కాదు. మన తాత తండ్రులు, తాతలు, తండ్రులు ఇలా జెనెటిక్ ఇన్ఫర్మేషన్‌ను ఉపయోగించి వ్యాధులను డయాగ్నైజ్ చేయటం మొదలవుతుంది. శాస్త్రీయంగా చెప్పాలంటే ఆరోగ్య సంరక్షణలో ప్రివెంటివ్ జెనోమిక్స్ ప్రాధాన్యం పెరుగుతుంది.



# ధాన్యం ఎగుమతి, దిగుమతులను సమీక్షించాలి !

హైదరాబాద్, మార్చి12అక్షరం న్యూస్;పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలతో ఎగుమతులు, దిగుమతులు ఆగిపోయాయి. ఓ రకంగా ఇది మనం సంక్షోభాన్ని సరిదిద్దుకునే సమయంగా భావించాలి. ఇప్పటికే ఇబ్బడిముబ్బడిగా ధాన్యాలు దిగుమతి చేసుకుంటున్నా భారత్ ఈ దశలో వీటిపై పునరాలోచన చేయాలి. దేశీయంగా పప్పు ధాన్యాలు, నూనె ధాన్యాలు విపరీతరంగా పండుతున్నా, రైతులకు కనీస మద్దతు ధరలు చెల్లించడం లేదు. అలాగే వేసిన పంటలను కొనుగోలు చేయడం లేదు. తెలంగాణలో శనగ, మక్కజొన్నలకు డిమాండ్ లేకుండా పోయింది. శనగ కొనుగోళ్లపై స్పష్టత కరవైంది. రైతులు సాగుచేసిన శనగ పంటకు మద్దతు ధర అందించడానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై స్పష్టత కరువైంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనగ పంటను నిల్వ ఉంచుకున్న రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం ఎదురు చూస్తున్నారు. పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు తిరిగి చెల్లించడానికి ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుందని కొంతమంది రైతులు వాపోతున్నారు. ఈ దశలో దేశీయంగా ఆయా రాష్ట్రాల్లో పండుతున్న పంటలను కొనుగోలుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ఆహార ధాన్యాలను కొనుగోలు చేసి, ప్రజలకు సరసమైన ధరల్లో అందించాలి. అదేవిధంగా దిగుమతులపై పూర్తి ఆంక్షలు విధించాలి. నూనెలు, పప్పులను దిగుమతి చేసుకోవడం తక్షణం ఆపాలి. గత కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి, గ్రామీణ ప్రాంతానికి సంబంధించి మూడు పద్దులను అంటే రూ.60 వేల కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం ఖర్చు పెట్టలేదని సమాచారం.. ఈ సంవత్సరం అందుకు భిన్నంగా జరుగుతుందని ఆశించలేం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంవత్సరం బడ్జెట్లో ధరల స్థిరీకరణ కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. కేంద్రం ఎఫ్‌సిఐ ద్వారా వివిధ రాష్ట్రాల నుంచి కొనాల్సిన కందులు, శనగలు, పెసలు, మొక్కజొన్నలు లాంటి 25 రకాల పంటలను కొనడానికి నిరాకరించింది. దేశంలోని 24 వేల స్థానిక మార్కెట్లు, 125 ప్రత్యేక మార్కెట్ల నిర్వహణను వదిలేయడం సరైనది కాదు. నిజానికి ధాన్యం సేకరణ, తిరిగి ప్రజలకు వాటిని ఆహార ధానా÷-యల రూపంలో చేరవేయడంలో పక్కా ప్రణాళిక లేకుండా పోయింది.ప్రైవేటు వ్యక్తులు కంపెనీలు, మార్కెట్లు పెట్టుకునేందుకు అనుమతించే బిల్లును గత ఫిబ్రవరిలో పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకుంది. గత రెండు సంవత్సరాలుగా వరి ధాన్యం, పత్తి, మిర్చి, పొగాకు, ఉల్లిపాయలు, కోకో లాంటి పంటలను




కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలకు కొనేవారే లేకుండా పోయారు. తక్కువ ధరలకు రైతులు అమ్ముకోవలసి వస్తున్నది. నిజానికి వ్యవసాయ విధానం సక్రమంగా ఉంటే, అనవసరపు దుబారా ఖర్చులు తగ్గించి, దేశీయంగా పంటలను ప్రోత్సహించి, ఉన్న పంటలను కొనుగోలు చేయాలి. అలాగే ప్రజలకు తక్కువ ధరలకు నిత్యావసరాలు సరఫరా చేసే వ్యవస్థను రూపొందించాలి. దీంతో దేశంలో ఆకలి బాధతలు తగ్గడంతో పాటు, కొనుగోలు శక్తి కూడా పెరుగుతుంది. కానీ గొప్పలు చెబుతున్న బిజెపి నేతలు ఒక్కరు కూడా సమగ్ర వ్యవసాయ విధానంపై ఆలోచన చేయడం లేదు. పంటలు పండుతున్నా, సామాన్యులకు ధరలు అందడం లేదు. అలాగే ఇబ్బడి ముబ్బడిగా దిగుమతులు పెంచేస్తున్నారు. ఉన్న వ్యవసాయాన్ని నాశనం చేసే చట్టాలు చేయడం, పార్లమెంట్, అసెంబ్లీల్లో వ్యవసాయ ధరలు లేక రైతులు బాధపడుతున్నారని మొసలి కన్నీరు కార్చడం అలవాటైపోయింది. ఇకపోతే న కిలీ విత్తనాలు కూడా రైతులను నట్టేట ముంచుతున్నాయి. విత్తనాలు అమ్మిన కంపెనీలపై చర్యలు తీసుకోవడం లేదు.కంపెనీ దగ్గర కొన్న విత్తనాలు సరిగ్గా మొలవకపోయినా, తగిన దిగబడి రాకపోయినా తర్వాత వ్యవసాయ సీజన్ లోపు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని 2001 విత్తన బిల్లులో ఉంది. కానీ ఈ తాజా బిల్లు ప్రకారం కంపెనీ విత్తనాలు రెండుసార్లు మొలవకపోయినా, సరైన దిగుబడులు రాకపోయినా ఆ రైతులకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించనవసరం లేదు. మూడవసారి ఆ కంపెనీ విత్తనాలు విఫలమైతే ఆ కంపెనీ ప్రభుత్వానికి ఫెనాల్టీ చెల్లించాలని బిల్లులో ఉంది కానీ రైతులకు నష్టపరిహారం చెల్లించాలని లేదు.పంటల బీమా చట్టం' కార్పొరేట్ కంపెనీలకు ధీమా కల్పిస్తున్నది కానీ రైతులకు కాదు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఆపరేషన్ గైడ్‌లైన్స్ మాత్రం వివరంగా ఉన్నాయి. ఆచరణలో ఈ పద్దు కింద ప్రతి సంవత్సరం కేటాయించే రూ.15 వేల కోట్లలో ఐదు వేల కోట్లు కూడా రైతులకు చేరడం లేదు. రూ.10 వేల కోట్లను కార్పొరేట్ బీమా కంపెనీలు మింగేస్తున్నాయి. వాతావరణం, క్రాప్ కటింగ్ ఎక్స్‌పరిమెంటేషన్‌లో ప్రైవేట్ కంపెనీల డేటాను వాడుతున్నారు. ప్రభుత్వ వ్యవసాయ బీమా కంపెనీలు డమ్మీలుగా మిగిలిపోతున్నాయి. ప్రైవేట్ కంపెనీదే పెత్తనం, వారే దోచేస్తున్నారు.వ్యవసాయానికి సంబంధించి పురుగు మందులలో అత్యంత దోపిడి జరుగుతున్నది. 100 రూపాయల మందుని వెయ్యి రూపాయలకు, 300 రుపాయలది 3 వేలకు అమ్ముతూ వ్యాపారస్తులు అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారు. దీనికి కారణం 'నూతన పురుగు మందుల విధానం'లో ఎం.ఆర్.పి విధానం పాటించాలని లేకపోవడమే. పురుగులను చంపడానికి ఆ ద్రావకంలో ఎంత శాతం మందు ఉండాలో అది ఉండక పోయినా వ్యాపారస్థులను అడిగేవారు లేరు. ఇలాంటి సమస్యలన్నీ చర్చించాలి. ఇందుకు తగిన సమయం ఇదే. సమగ్ర వ్యవసాయ విధానం,ఎగుమతులు దిగుమతులపై చర్చించాలి. దేశీయ పంటలను పండించుకుని తినేలా వ్యవస్థీకృత పద్ధతిని తీసుకుని రావాలి. అప్పుడే దేశం ఆర్థికంగా బలపడుతుంది. మన రైతులు ఆనందంగా ఉంటారు.

# గ్యాస్ కొరతతో హోటళ్లు మూత

- హాస్టళ్ల పరిస్థితి మరింత దారుణం
- ఆర్టీసీ క్రాస్‌రోడ్ బావర్చి మూసివేత
- ప్యారడైజ్ హోటల్ కూడా అదే దుస్థితి
- బ్లాక్ విక్రయాలపై కఠిన చర్యలు తప్పవన్న అధికారులు

హైదరాబాద్,మార్చి12అక్షరం న్యూస్; వంటగ్యాస్ కొరత హోటల్ పరిశ్రమను అతలాకుతలం చేస్తోంది. ఇక్కడ హాస్టళ్లో ఉంటూ చదువుకుంటున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్య దుర్భర పరిస్థితి నెలకొంది. అలాగే హోటల పరిశ్రమపై ఆధారపడ్డ నిరుద్యోగులు కూడా ఆందోళన చెందుతున్నారు. మహానగరంలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిచిపోయింది. వంటగ్యాస్ సిలిండర్ల సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె. శ్రీనివాస్ తెలిపారు. సిలిండర్లను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయిల్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేశామని, ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. నెలకు ఒక సిలిండర్ బుకింగ్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పశ్చిమాసియా యుద్ధం పీజీ యజమానుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. ఓవైపు గ్యాస్ కొరతతో నగరంలోని పలు హోటళ్లను తాత్కాలికంగా మూసేస్తుంటే, మరోవైపు హాస్టళ్ల నిర్వహణపై యజమానులు మల్లగుల్లాలుపడుతున్నారు. కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా బుధవారం నుంచి నగరంలో దాదాపుగా ఆగిపోవడంతో హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారింది.గ్యాస్ వినియోగం ఎక్కువ అయ్యే దోసె, పూరీ, చపాతీ వంటకాలను తాత్కాలికంగా అన్ని హాస్టళ్లలో నిలిపివేసినట్లు సమాచారం. గ్యాస్ కొరత తీరేవరకు అన్నం, సాంబారు, కూరతో సాధారణ భోజనాన్ని మాత్రమే అందించగలమని ఐటీకారిడార్‌లోని హాస్టల్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ప్రకటించారు. చికెన్, కోడిగుడ్డుకూర, వేపుళ్లు వంటి అదనపు వంటలను నిలుపుదలచేస్తున్నట్లు తెలిపారు. టీ, కాఫీ లాంటివాటిని అందించలేమని వెల్లడిస్తున్నారు. గ్రేటర్ పరిధిలో మూడు, నాలుగు రోజులుగా సిలిండర్ల బుకింగ్ కావడం లేదని



ప్రజలు వాపోతున్నారు. సర్వర్ డౌన్‌తో బుకింగ్ కావడం లేదంటున్నారు. వాట్సాప్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం ఉన్నా కావడం లేదంటున్నారు.ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని బావర్చి హోటల్‌ను బుధవారం మూసేశారు. గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగానే మూసేసిన్నట్లుగా తెలిసింది. ప్రముఖ ప్యారడైజ్ హోటల్స్ అన్ని బ్రాంచీలలో టీ అమ్మకాలను నిలిపివేశారు. ఐటీసీ సంస్థ కూడా వివిధ ప్రాంతాల్లో గల సంస్థ హోటల్స్‌లో గ్యాస్ కొరత కారణంగా లంచ్, డిన్నర్ ఉండదని ప్రకటించింది. ఒకవేళ దొరికినా కొన్ని ప్రాంతాల్లో రూ. 4 వేలకు, మరికొన్ని ప్రాంతాల్లో రూ. 3,500కు విక్రయిస్తున్నారు. 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర సాధారణంగా రూ.2105ల వరకు ఉంది. బుధవారం నుంచి కమర్షియల్ సిలిండర్ల సరఫరా పూర్తిగా బంద్ అయింది. పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో కూడా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను నిలిపివేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా లేకపోవడం, మార్కెట్‌లో అధిక ధర ఉండడంతో కొనుగోలు చేయలేక పలు హోటల్స్ మూత పడుతున్నాయి. సిలిండర్ కొరతతో హోటల్స్ మూసేస్తున్నట్లు యజమానులు ప్రకటించారు. అవసరమైతే అవసరమైతే కట్టెల పొయ్యి మీద వంట చేస్తామని చెప్పారు. ఇక పలు ప్రాంతాల్లో టిఫిన్ సెంటర్‌లో కమర్షియల్ సిలిండర్ సరఫరా లేకపోవడంతో హోటల్ మూసివేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టిఫిన్ సెంటర్ బందు చేసుకోవాల్సి వస్తదేమోనని ఆందోళన చెందారు. అఫ్జల్‌గంజ్, బేగంబజార్‌లో కొన్ని టిఫిన్ సెంటర్లలో గ్యాస్ లేకపోవడంతో మూసేస్తున్నారు. వేల రూపాయలు పెట్టి సిలిండర్ కొనుగోలు చేసి వ్యాపారం ఎలా చేస్తామని చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ కొరతతో పలు ప్రాంతాల్లో బిర్యానీ సెంటర్లు మూతపడ్డాయి. పలు ప్రాంతాల్లో వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు దొరక్కపోవడంతో టీ షాపులు, బండి వ్యాపారులు, టిఫిన్ సెంటర్ల నిర్వహకులు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాడుతున్నారు. కొందరూ గృహ వినియోగదారులు 14కిలోల గ్యాస్ సిలిండర్‌ను రూ.1800ల వరకు అమ్ముతున్నారు. గ్యాస్ సిలిండర్ల కొరతతో హోటళ్లు మూతపడుతున్నాయి. గృహావసరాల సిలిండర్ల సరఫరా తగ్గింది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే రూ.5 భోజనానికి ఇబ్బంది ఉండదని జీహెచ్‌ఎంసీ వర్గాలు చెబుతున్నాయి.విద్యుత్‌తో నడిచే యంత్రాలతో భోజనం తయారు చేస్తున్న దృష్ట్యా గ్యాస్ కొరత ప్రభావం తయారీపై ఉండబోదని జీహెచ్‌ఎంసీ అధికారి ఒకరు తెలిపారు. సిలిండర్లకు ప్రత్యామ్నాయ మర్గాలను నిర్వాహకులు అన్వేషిస్తున్నారని అమీర్‌పేట హాస్టళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు చెబుతున్నారు. బుధవారం అమీర్‌పేట ప్రాంతంలోని హాస్టల్ నిర్వాహకులు 120కుపైగా ఎలక్ట్రికల్ స్టౌలు కొనుగోలు చేసినట్లు సమాచారం. కొందరు కట్టెల పొయ్యి ఏర్పాటుచేసుకున్నారని దుర్గానగర్ హాస్టళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ చెప్పారు. గ్యాస్ కొరత నేపథ్యంలో హాస్టళ్ల యజమానులంతా ఒక్కటయ్యారు. నిర్వహణ విషయంలో తాత్కాలిక నిబంధనలు రూపొందించి అమలుచేస్తున్నారు.విద్యా, ఉద్యోగ అవకాశాల కోసం నగరానికి వచ్చిన యువతకు ఆశ్రయమిచ్చే పేయింగ్ గెస్ట్ హాస్టళ్ల నిర్వహణ ఇప్పుడు మరింత భారంగా మారింది. మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కోర్సులు నేర్చుకోడానికి వచ్చే విద్యార్థుల సంఖ్య ఏడాదిగా బాగా తగ్గింది. దాంతో ప్రైవేటు హాస్టళ్ల వ్యాపారం మందకొండిగా నడుస్తోంది. గ్యాస్ కొరత మమ్మల్ని మరింత నష్టాల్లోకి నెడుతుంది. ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతున్నాం. హాస్టల్‌లో ఉంటున్నవారికి అన్నం, కూర, సాంబారైనా వడ్డించడానికి ప్రత్నిస్తున్నాం అంటున్నారు.

## దిక్కుతోచని శనగ, మక్కరైతులు

- కొనుగోలు కేంద్రాలు లేక ఆందోళన
- ఉన్నతాధికారులకు నివేదించామన్న మార్క్‌ఫెడ్


నిజామాబాద్,మార్చి12అక్షరం న్యూస్; జిల్లాలో శనగ, మక్క రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు పండించినా కొనుగోలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడ్డికి పావుసేరు అన్నట్లుగా ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. అయితే ఈ సమస్యలపై అధికారుల నుంచి స్పష్టమైన హామీలు రావడం లేదు. శనగ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఉన్నతాధికారులకు నివేదికను అందజేశామని మార్క్‌ఫెడ్ డీఎం శశిధర్ అన్నారు. ఎన్‌సీసీ వారి నుంచి అనుమతులు రాగానే కేంద్రాలు ఏర్పాటు చేసి శనగలు కొనుగోలు చేస్తామని చెప్పారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే మద్దతు ధర రూ.5,875 లభిస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్న రైతులకు నిరాశ తప్పడంలేదు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో గత్యంతరం లేక పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు, కుటుంబ అవసరాల కోసం దళారులకు రూ.4,900 నుంచి రూ.5,300 వరకు విక్రయించి నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనగ పంట సాగు చేయడానికి పెట్టుబడి ఖర్చు ఎక్కువ కావడం, వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడంతో దిగుబడి తక్కువగా వచ్చి సుమారు ఎకరానికి రూ.5,600 ఖర్చయినట్లు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వ మద్దతు ధర లేక నష్టపోతున్నామని వాపోతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్‌లో వ్యాపారులు తక్కువ ధర అంటే రూ.5,100లకే అడుగుతున్నారు. ముందుగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై పంటను సేకరించి ఉంటే ఇబ్బందులు వచ్చేవి కావని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎవరూ పట్టించుకోవడం లేదు. తక్కువ ధరకే అమ్మి రైతులు నష్టపోతున్నారు. పంట కోతకు వచ్చే సమయంలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే రైతులు పంటలు అమ్ముకోగలరని అంటున్నారు. దీంతో రైతులకు శనగ విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు రాజ్యమేలుతున్నారు. రైతులు నిల్వ సౌకర్యం లేక, చేసిన అప్పుల ఒత్తిడితో పంటను అమ్ముకోవాల్సి వస్తున్నది. రైతుల అవసరాలను ఆసరాగా తీసుకుని దళారులు తక్కువ ధరకే శనగలు కొనుగోలు చేసి, సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు తరలిస్తున్నారు. అక్కడ ఎక్కువ ధరకు విక్రయించి లాభాలు గడిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

## రైతులను బలహీనం చేసేలా చట్టాలు

- కౌలు రైతులను విస్మరిస్తున్న పాలకులు
- వ్యవసాయరంగం మరింత సంక్షోభంలోకి నెట్టే చర్యలు

అమరావతి,మార్చి12అక్షరం న్యూస్; పేద రైతు, కౌలు రైతు కేంద్రంగా ఉన్న వ్యవసాయాన్ని చట్టాల ద్వారా కార్పొరేట్లకు కట్టబెట్టడానికి మార్గం సిద్ధం చేస్తున్నారనేది స్పష్టంగా తెలుస్తుంది. వ్యవసాయ సంక్షోభం, యువరైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయేగాని తరగడం లేదు. అందుకుగల కారణాలను, పరిష్కారాలను కనిపెట్టడంలో ప్రభుత్వం వైపు నుండి వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. చంద్రబాబు నాయుడు రాష్ట్ర అసెంబ్లీలో 'డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్' పత్రాన్ని ప్రవేశ పెట్టినప్పుడు కొన్ని ముఖ్యాంశాలను ప్రస్తావించారు. స్వర్ణాంధ్ర 2047 సాధించే సమయానికి వ్యవసాయరంగంపై ఆధారపడే జనాభా 60 శాతం నుండి 10 శాతానికి పడిపోతుందని అంచనా వేస్తున్నారు. నేడున్న వ్యవసాయ భూములు కూడా 30 శాతం చాలవని అంటున్నారు.. మిగతాది అవసరం లేదన్న ధోరణి కనిపిస్తోంది. అంటే ఆ భూములను ఎవరికైనా అమ్ముకోవచ్చన్న ధోరణి కనిపిస్తోంది. వ్యవసాయ రంగంలో మిగిలిపోయే మిగతా 50 శాతం జనాభాను పట్టణాలకు తరలించి వారిని చీప్ లేబర్‌గా వాడుకోవచ్చన్న దుర్మార్గ ఆలోచన కూడా ఇందులో ఇమిడి ఉంది. కేంద్ర ప్రభుత్వం సైతం ఈ సంవత్సరం 100 లక్షల ఎకరాలను అమ్మకానికి సిద్ధం చేసింది. నూతన నీటి విధానం' ప్రకారం కాలువలకు, పొలాలకు మీటర్లు పెట్టి నీటి వాడకాన్నిబట్టి రైతుల నుండి చార్జీలు వసూలు చేస్తారు. పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణానికి కంపెనీల నుంచి పెట్టుబడులు ఆహ్వానిస్తారు. ఈ విధానం పేద రైతులకు వ్యతిరేకమైనదిగా గుర్తించాలి. అప్పుడు సాగునీరు చాలా ఖరీదైనదిగా మారుతుంది. ఇకపోతే విత్తన బిల్లు 2025' చూస్తే రైతులకు ఆందోళన కలుగుతుంది. విద్యుత్ సవరణ చట్టం 2025' ప్రకారం మొత్తం విద్యుత్ వ్యవస్థను ప్రైవేటీకరించడం ప్రధానాంశం. ఐదు సంవత్సరాలలో క్రాస్ సబ్సిడీని రద్దు చేయాలనేది మరో కీలకాంశం. ఇది మెట్ట ప్రాంతాలలో, గిరిజన ఏరియాలో, వెనుకబడ్డ ప్రాంతాలలో చిన్న రైతుల పంపుసెట్లు, లిఫ్ట్‌ల వ్యవసాయాన్ని బాగా దెబ్బతీస్తుంది. ఎరువుల విధానం 2025' ప్రకారం ఎరువులపై ప్రభుత్వ నియంత్రణ తొలగించారు. సకాలంలో రైతులకు అందక పోయినా, ఉండాల్సిన నాణ్యత లేకపోయినా, ధర పద్ధతులలో తేడాలున్నా ప్రభుత్వ యంత్రాంగానికి బాధ్యత లేదు. ఇప్పుడు ఈ విధానంలో అదనంగా నానో లిక్విడ్ యూరియాను ప్రవేశ పెట్టింది. దాంట్లో నత్రజని 45 శాతం నుంచి 4 శాతానికి తగ్గుతుంది. యూరియాపై ప్రభుత్వ సబ్సిడీ మొత్తం తగ్గించి నగదు బదిలీ పథకం పెట్టాలని కేంద్రం రాష్ట్రాలను కోరుతోంది. నానో యూరియా తీసుకున్న రాష్ట్రంలో బస్తాకు రూ.800 సబ్సిడీ ఇస్తానని ప్రకటించింది. ప్రకృతి విపత్తుల చట్టం 25, సెక్షన్ 12లో బాధితులను ఆదుకోవడానికి వున్న సూచనలు తొలగించారు. సెక్షన్ 13లో పంటలు కోల్పోయిన రైతులకు చెందిన రుణాలు వాయిదా వేసి తిరిగి పంట రుణాలు రీషెడ్యూల్ చేసే చాప్టర్‌ను తొలగించారు. ఇరవై నెలల్లో ఇన్ని చట్టాలు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయానికి గుండెకాయ లాంటి కౌలు రైతులకు ప్రభుత్వ వ్యవసాయ పథకాలు అందించే చట్టం చేయకపోవడం దారుణం.

# కోడిగుడ్లను ఎలా తింటే శరీరానికి అధిక మొత్తంలో పోషకాలు లభిస్తాయి.. వీటిని ఎలా తినాలి..?



అత్యంత పోషకపరమైన ఆహారాల్లో గుడ్లు కూడా ఒకటి. వీటిని రోజూ వారి ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల శరీరానికి ఎంతో మేలు కలుగుతుంది. వీటిలో అనేక పోషకాలు ఉంటాయి కనుక వీటిని సంపూర్ణ ఆహారంగా చెప్పవచ్చు. గుడ్లు కంప్లీట్ ప్రోటీన్ గా పరిగణించబడతాయి. శరీరం స్వయంగా తయారు చేసుకోలేని తొమ్మిది ముఖ్యమైన అమైనో ఆమ్లాలు గుడ్డులో ఉంటాయి. కండరాల పునరుద్ధరణలో, పెరుగుదలలో, శరీర పనితీరుకు ఇవి ఎంతో సహాయపడతాయి. వీటితో పాటు గుడ్డులో విటమిన్ బి12, విటమిన్ డి, సెలీనియం, కొలిన్ వంటి ముఖ్యమైన పోషకాలు కూడా ఉంటాయి. బరువును నియంత్రించడంలో, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, కంటి ఆరోగ్యాన్ని కాపాడడంలో ఇవి ఎంతో సహాయపడతాయి. గుడ్డును వివిధ రూపాల్లో వండుకుని తీసుకుంటూ ఉంటారు. అయితే గుడ్లను వండే విధానం వాటి పోషక విలువలపై ప్రభావం చూపిస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

### ఉడకబెట్టి లేదా పోచింగ్ చేసి..

గుడ్లను కొందరు పచ్చిగా తీసుకుంటారు. అయితే ఇలా తీసుకోవడానికి బదులుగా గుడ్లను వండి తీసుకోవడం వల్ల వీటిలో ఉండే ప్రోటీన్ సులభంగా జీర్ణమవుతుంది. అలాగే గుడ్డులో ఉండే బయోటిన్ అనే విటమిన్ ను శరీరం సులభంగా ఉపయోగించుకోగలుగుతుంది. గుడ్లను తక్కువ సమయం తక్కువ ఉష్ణోగ్రత మీద ఉడికించి తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మేలు కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే గుడ్లను ఉడకబెట్టడం లేదా పోచింగ్ చేయడం అత్యంత ఆరోగ్యకరమైన పద్ధతుల్లో ఒకటి. గుడ్లను ఉడకబెట్టడం వల్ల నూనె, వెన్న వంటి వాటి అవసరం ఉండదు. దీంతో తక్కువ క్యాలరీలు, ఎక్కువ పోషకాలను తీసుకోగలుగుతారు. అలాగే తక్కువ ఉష్ణోగ్రతలో వండడం వల్ల వేడి వల్ల నశించే పోషకాలు ఎక్కువగా నశించకుండా ఉంటాయి. కొలెస్ట్రాల్ ఆక్సిడేషన్ కూడా తగ్గుతుంది.

### ఆలివ్ ఆయిల్ మేలు..

ఇక ఉడకబెట్టడంతో పాటు గుడ్లను స్క్రాంబుల్ చేసి కూడా తీసుకోవచ్చు. స్క్రాంబుల్ గుడ్లు కూడా ఆరోగ్యకరమైన ఎంపికల్లో ఒకటి. అయితే దీనిని తయారు చేసేటప్పుడు ఆలివ్ ఆయిల్ లేదా అవకాడో ఆయిల్ వంటి తక్కువ కొవ్వులు ఉన్న నూనెలను ఉపయోగించడం మంచిది. ఇందులో పాలకూర, క్యాప్సికం, టమాటా వంటి కూరగాయలు కలిపి తక్కువ ఉష్ణోగ్రత వద్ద వండి తీసుకోవడం వల్ల మరింత మేలు కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అదే విధంగా గుడ్లను ఎక్కువ సమయం ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద వండడం మంచిది కాదని ఇలా వండడం వల్ల హానికరమైన సంయోగాలు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు తెలియజేస్తున్నారు. అలాగే గుడ్డులో ఉండే పోషకాలను ఎక్కువ మొత్తంలో పొందడానికి వారు కొన్ని సూచనలను కూడా చేస్తున్నారు.

### కూరగాయలతో కలిపి అయితే..


ఎల్లప్పుడూ తాజా లేదా ఆర్గానిక్ గుడ్లను మాత్రమే ఎంచుకోవాలి. తాజా గుడ్లల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. అలాగే వీటిని పాలకూర, టమాటా, క్యాప్సికం వంటి ఫైబర్ ఎక్కువగా ఉండే కూరగాయలతో కలిపి తీసుకోవడం మంచిది. గుడ్డులోని పోషకాలు ఎక్కువగా పచ్చసొనలోనే ఉంటాయి. కనుక గరిష్ట ప్రయోజనాల కోసం పచ్చసొనను తీసుకోవడం మంచిది. గుడ్డును ఎక్కువ వేడి వద్ద ఎక్కువ సమయం ఉడికించడం వల్ల విటమిన్ డి సుమారు 61 శాతం తగ్గుతుంది. కనుక వీటిని తక్కువ ఉష్ణోగ్రత వద్ద ఉడికించడం మంచిది. గుడ్డు ఆరోగ్యానికి మేలు చేసేదే అయినప్పటికీ వీటిని మితంగా తీసుకోవడం మంచిది. ఆరోగ్యంగా ఉండే వ్యక్తులు రోజుకు ఒక గుడ్డు తినడం సురక్షితం అని నిపుణులు తెలియజేస్తున్నారు. ఈ విధంగా తగిన సూచనలను పాటిస్తూ గుడ్లను తీసుకోవడం వల్ల వాటి వల్ల కలిగే ప్రయోజనాలను అధిక మొత్తంలో పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# టాయిలెట్‌లో ఎక్కువ సేపు కూర్చుని ఫోన్ చూస్తే అంతే.. పైల్స్ గ్యారంటీ అంటున్న నిపుణులు..

టాయిలెట్‌లో కూర్చుని మొబైల్‌లో స్క్రోల్ చేయడం ఇప్పుడు చాలా మందికి అలవాటుగా మారిందని చెప్పవచ్చు. పెద్దలలో సుమారు 66% మంది టాయిలెట్‌లో కూర్చుని వార్తలు చూడటం లేదా సోషల్ మీడియా బ్రౌజ్ చేయడం చేస్తూ ఉంటారు. ఈ ఆధునిక అలవాటు కారణంగా చాలా మంది టాయిలెట్‌లో ఎక్కువసేపు కూర్చుంటున్నారు. ఇది వారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇలా ఎక్కువసేపు కూర్చుని మొబైల్ ఉపయోగించడం వల్ల పెద్దప్రేగు దగ్గర ఉన్న రక్తనాళాలు ఉబ్బిపోయి పైల్స్ (హెమరాయిడ్స్) సమస్య వచ్చే అవకాశం ఉందని ఇవి అంతర్గతంగా లేదా బయట వైపు కూడా రావచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు. మన దేశంలో సుమారు 4 కోట్ల మందికి పైగా పైల్స్ సమస్యతో బాధపడుతున్నారు. ప్రతి సంవత్సరం సుమారు 10 లక్షల కేసులు కొత్తగా గుర్తించబడుతున్నాయి.

టాయిలెట్‌లో ఎక్కువ సేపు గడిపితే.. పైల్స్ సమస్యతో బాధపడే వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుందని, టాయిలెట్ లో ఎక్కువ సమయం కూర్చోవడం కూడా ఇందుకు ఒక కారణమని నిపుణులు చెబుతున్నారు. అసలు టాయిలెట్‌లో కూర్చుని ఎక్కువ సమయం మొబైల్ వాడటం వల్ల పైల్స్ ఎందుకు వస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం. ాబఎశ్రీఅష ాఅఎత్ఘుతీఎ శీట ాఎఅవఅఎవ ాఅవ లో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనం ప్రకారం, టాయిలెట్‌లో మొబైల్ స్క్రోల్ చేయడం వల్ల పైల్స్ వచ్చే ప్రమాదం 46% వరకు పెరుగుతుంది. దీని వల్ల నొప్పి, దురద, రక్తస్రావం కూడా రావచ్చు. హెమరాయిడ్స్ అనేవి పెద్దప్రేగు లేదా మలద్వారం వద్ద ఉన్న రక్తనాళాలు ఉబ్బిపోవడం వల్ల వస్తాయి. టాయిలెట్‌లో ఎక్కువసేపు కూర్చోవడం వల్ల మలద్వారం దగ్గర ఒత్తిడి ఎక్కువగా పడుతుంది. దీని వల్ల అక్కడి రక్తనాళాలు విస్తరించి ఉబ్బిపోతాయి. కనెక్టివ్ టిష్యూ బలహీనపడుతుంది. మొబైల్ వాడటం వల్ల తెలియకుండా ఎక్కువ సమయం టాయిలెట్‌లో కూర్చుంటారు. దీని వల్ల మలద్వారంపై ఒత్తిడి పడి పైల్స్ వచ్చే అవకాశం పెరుగుతుంది. అంతేకాకుండా టాయిలెట్‌లో కూర్చొని మొబైల్ వాడటం వల్ల ఇతర అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం కూడా ఉంటుందని నిపుణులు తెలియజేస్తున్నారు.

# రాత్రి సమయంలో ఆకలి అవుతుందా.. ఇలా ఎందుకు జరుగుతుంది.. ఏం చేయాలి..?



రాత్రి సమయంలో ఆకలిగా అనిపించినప్పుడు చాలా మంది తమని తాము నిందించుకుంటారు. అది కేవలం నియంత్రణ లేకపోవడం లేదా అనారోగ్యకరమైన స్నాక్స్ తినే అలవాటు వల్లనే అని భావిస్తారు. అయితే రాత్రి తరచుగా ఆకలి వేయడం అనేది చాలా సందర్భాల్లో శరీరంలోని జీవసంబంధ ప్రక్రియలు, హార్మోన్ల మార్పుల కారణంగా కూడా జరగవచ్చని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. ఆకలి అవ్వడం అనేది శరీరంలోని అంతర్గత గడియారం, ఆకలి, తృప్తి, మెటాబాలిజాన్ని నియంత్రించే పలు హార్మోన్లపై ఆధారపడి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. నిద్ర సరిగా లేకపోవడం, ఒత్తిడి, మెటాబాలిక్ సమస్యలు లేదా హార్మోన్ మార్పులు వంటి కారణాల వల్ల ఈ వ్యవస్థలు ప్రభావితమైతే సాయంత్రం లేదా రాత్రి సమయంలో ఆకలి ఎక్కువగా అనిపించవచ్చని వారు చెబుతున్నారు.

### హార్మోన్ల ప్రభావం..

రాత్రి ఆలస్యంగా ఆకలి వేయడాన్ని చాలా మంది బలహీన సంకల్పంగా భావిస్తారు. కానీ చాలా సందర్భాల్లో అది శరీర జీవశాస్త్రంతో సంబంధం ఉంటుంది. ఆకలిని సర్కేడియన్ క్లాక్‌తో పాటు గ్రెలిన్, లెప్టిన్, ఇన్సులిన్, కార్టిసాల్ వంటి హార్మోన్లు నియంత్రిస్తాయి అని వైద్యులు చెబుతున్నారు. అలాగే ఏం తింటారనే విషయం ఎంత ముఖ్యమో, ఎప్పుడు తింటారనేది కూడా అంతే ముఖ్యమని, సాయంత్రం ఆలస్యంగా తినడం వల్ల ఆకలి పెరగడం, శరీరం క్యాలరీలను ఖర్చు చేసే సామర్థ్యం తగ్గడం జరుగుతుంది. దీని వల్ల బరువు పెరగడం, మెటాబాలిక్ వ్యాధుల ప్రమాదం కూడా పెరుగుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు. అందువల్ల రాత్రి తరచుగా ఆకలి వేయడం అనేది కేవలం అలవాటు మాత్రమే కాకుండా నిద్ర సమస్యలు లేదా హార్మోన్ మార్పులు వంటి ఆరోగ్య సమస్యలకు సంకేతం కావచ్చు అని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### రాత్రిపూట ఆలస్యంగా తింటే..

శరీరంలోని ఆకలి నియంత్రణ వ్యవస్థ చాలా సంక్లిష్టంగా ఉంటుంది. గ్రెలిన్ ఆకలిని పెంచుతుంది. లెప్టిన్ తృప్తి సంకేతాన్ని ఇస్తుంది. జీఎల్‌పీ-1, పెప్టైడ్ yy వంటి జీర్ణాశయ హార్మోన్లు భోజనం తర్వాత తృప్తిని పెంచుతాయి. ఇన్సులిన్ రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రిస్తుంది. కార్టిసాల్ ఒత్తిడి, నిద్ర నమూనాలను ఆహార కోరికలతో కలిపి ప్రభావితం చేస్తుంది. ఈ హార్మోన్లన్నీ రోజువారీ జీవ గడియారం ప్రకారం పనిచేస్తాయని నిద్ర తగ్గిపోవడం లేదా ఆలస్యంగా నిద్రించడం వల్ల ముఖ్యంగా సాయంత్రం సమయంలో ఆకలి సంకేతాలు ఎక్కువగా రావచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు. అలాగే ఒకే రకమైన క్యాలరీలు తీసుకున్నప్పటికీ రోజులో ఆలస్యంగా తినేవారిలో ఆకలి ఎక్కువగా ఉండడం, శక్తి వినియోగం తగ్గిపోవడం జరుగుతుందని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. హార్వర్డ్ మెడికల్ స్కూల్, బ్రిగ్హామ్ అండ్ ఉమెన్స్ హాస్పిటల్ నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం, ఆలస్యంగా తినే వ్యక్తుల్లో ఆకలి ఎక్కువగా ఉంటుంది. క్యాలరీలు ఖర్చయ్యే వేగం తగ్గుతుంది. కొవ్వు నిల్వకు సంబంధించిన హార్మోన్ మార్పులు కూడా జరుగుతాయి. నిద్ర లేకపోవడం ఈ సమస్యను మరింత పెంచుతుంది. నిద్ర తక్కువగా ఉంటే గ్రెలిన్ పెరిగి, లెప్టిన్ తగ్గిపోతుంది. దీని వల్ల ఎక్కువగా ఆకలి వేస్తుంది. అధిక క్యాలరీల ఆహారం తినాలనే కోరిక పెరుగుతుంది.

### ఎండోక్రైన్ లేదా మెటబాలిక్ వ్యాధులు ఉంటే..

ఇక వైద్యుల చెబుతున్న దాని ప్రకారం కొన్ని ఎండోక్రైన్, మెటాబాలిక్ వ్యాధులు కూడా రాత్రి ఆకలి పెరగడానికి కారణం కావచ్చు. స్థూలకాయం, PCOS, మెనోపాజ్ లేదా పెరిమెనోపాజ్, కుషింగ్స్ సిండ్రోమ్, స్లీప్ అప్నియా వంటి వ్యాధులు కూడా ఆకలి పెరగడానికి కారణం అవుతాయని వైద్యులు చెబుతున్నారు. వీటితో పాటు ఇన్సులిన్ రెసిస్టెన్స్, నిద్ర విఘాతం లేదా కార్టిసాల్ మార్పులు వంటివి కూడా రాత్రి సమయంలో ఆకలిని పెంచుతాయి. అలాగే స్త్రీలల్లో మెనోపాజ్ సమయంలో ఈస్ట్రోజెన్ స్థాయిలు తగ్గడం వల్ల నిద్ర సమస్యలు, మూడ్ మార్పులు, శరీర కొవ్వు పంపిణీ మార్పులు జరుగుతాయి. ఇవి కూడా స్త్రీలలో ఆకలి పెరగడానికి కారణమవుతుంది. అలాగే స్లీప్ అప్నియా వంటి నిద్ర సమస్యలు కూడా ఆకలి నియంత్రణను ప్రభావితం చేస్తాయి. ఇవి కూడా బరువు పెరగడం, మెటాబాలిక్ సమస్యలకు దారితీయవచ్చు.

### జీఎల్‌పీ-1 మందుల ప్రభావం..

అయితే కొత్తగా వచ్చిన జీఎల్‌పీ-1 హార్మోన్‌ను అనుకరించే బరువు తగ్గించే మందులు ఆకలిని తగ్గించడంలో సహాయపడుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ మందులు సాధారణంగా ఆకలిని తగ్గిస్తాయి. ఎప్పుడూ తినాలనే ఆలోచనని కూడా తగ్గిస్తాయి. అయితే కొన్ని పరిస్థితుల్లో రాత్రి ఆకలి కొనసాగవచ్చు. మందు మోతాదు ప్రారంభ దశలో ఉండటం, రోజులో తగినంత ప్రోటీన్ తీసుకోకపోవడం, వాంతుల భయం వల్ల భోజనం మానేయడం, నిద్ర సమస్యలు ఉండటం వల్ల ఆకలి అలాగే కొనసాగవచ్చు. జీఎల్‌పీ-1 రిసెప్టర్ అగోనిస్టులు మెదడులో తృప్తి కేంద్రాలను ఉత్తేజపరచి, జీర్ణశాయ-మెదడు సంకేతాలను మెరుగుపరచడం ద్వారా తక్కువ ఆహారం తినేలా చేస్తాయి. 2025 డిసెంబర్‌లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) స్థూలకాయ చికిత్సలో జీఎల్‌పీ-1 మందులపై మొదటి మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మందులను కేవలం అందం కోసం కాకుండా దీర్ఘకాలిక వ్యాధి చికిత్సలో భాగంగా ఉపయోగించాలని సూచించింది.

### వైద్యులను కలవాలి..

కొన్నిసార్లు రాత్రి ఆకలి సాధారణమే అయినప్పటికీ రాత్రి తక్కువ బ్లడ్ షుగర్ లక్షణాలు, చెమటలు ఎక్కువగా పట్టడం, భయంకరమైన కలలు, ఉదయం తలనొప్పి, గందరగోళం, గుండె వేగంగా కొట్టుకోవడం, రాత్రి సమయంలో బ్లడ్ షుగర్ 70 mg/dL కంటే తక్కువగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. రాత్రి ఆకలి వేయడాన్ని చాలా మంది కేవలం అలవాటు లేదా నియంత్రణ లేకపోవడంగా భావిస్తారు. కానీ శాస్త్రీయ పరిశోధనలు చెబుతున్నదేమిటంటే హార్మోన్లు, నిద్ర, మెటాబాలిజం, శరీర జీవ గడియారం కలిసి ఈ సమస్యను ప్రభావితం చేస్తాయి. అప్పుడప్పుడు రాత్రి ఆకలి కావడం సహజం. అయితే ఇది తరచుగా జరుగుతూ ఇతర లక్షణాలతోపాటు ఉంటే వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

# వేసవి కాలంలో తాగే కాంజీ పానీయం.. ఎలా తయారు చేయాలి.. దీంతో కలిగే లాభాలు ఏమిటి..?



కాంజీ అనేది పులియబెట్టిన సాంప్రదాయ భారతీయ వేసవి పానీయం. ఇది సాధారణంగా నల్ల క్యారెట్, ఆవాలు, నీరు కలిపి తయారు చేస్తారు. ఈ సాంప్రదాయ వేసవి పానీయంలో ప్రోబయోటిక్స్ సమృద్ధిగా ఉంటాయి. కనుక జీర్ణాశయ ఆరోగ్యానికి మేలు చేసేదిగా ఇది ప్రసిద్ధి చెందింది. కాంజీని తీసుకోవడం వల్ల జీర్ణ ఆరోగ్యం మెరుగుపడడంతోపాటు శరీరానికి కూడా అనేక ప్రయోజనాలు అందుతాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో, శరీరాన్ని చల్లబరిచే, హైడ్రేట్ చేసే పానీయాలు తీసుకోవడం చాలా అవసరం. అధిక వేడి కారణంగా జీర్ణవ్యవస్థ మందగిస్తుంది. అందుకే కాంజీ వంటి ఫెర్మెంటెడ్ పానీయాలు ఇప్పుడు ఎక్కువగా ప్రాచుర్యం పొందుతున్నాయి. శాస్త్రీయంగా కూడా ఇవి జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడం, రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయని పరిశోధనలు కూడా సూచిస్తున్నాయి. కాంజీలో ఉన్న ప్రోబయోటిక్స్ వేసవిలో సహజంగా మందగించే జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయని అధ్యయనాలు కూడా తెలియజేస్తున్నాయి.

### అధిక సంఖ్యలో ప్రో బయోటిక్స్..

జీర్ణవ్యవస్థ సరిగా పనిచేస్తేనే రోగనిరోధక శక్తి కూడా మెరుగుపడుతుంది. శరీరంలోని 70-80% రోగనిరోధక కణాలు జీర్ణాశయంలోనే ఉంటాయి. అందువల్ల జీర్ణాశయం ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. కాంజీ ఫెర్మెంటేషన్ ప్రక్రియ ద్వారా తయారవుతుంది. కనుక ఈ ప్రక్రియ వల్ల దాని ఆరోగ్య ప్రయోజనాలు మరింత పెరుగుతాయి. కాంజీని సాధారణంగా సూర్యరశ్మిలో ఉంచి ఫెర్మెంట్ చేస్తారు. ఇలా చేయడం వల్ల ఇందులో ప్రోబయోటిక్స్ సంఖ్య పెరుగుతుంది. ఫెర్మెంటేషన్ సమయంలో ఉపయోగకరమైన సూక్ష్మజీవులు పెరుగుతాయి. ఇవి జీర్ణాశయంలోని మంచి బ్యాక్టీరియాను సమతుల్యంగా ఉంచి జీర్ణక్రియను మెరుగుపరచడంతోపాటు రోగనిరోధక శక్తిని కూడా పెంచుతాయి. కాంజీలో ముఖ్యంగా లాక్టోబాసిల్లస్, బిఫిడోబాక్టీరియం, ఎంటరోకోకస్ వంటి బ్యాక్టీరియాలు ఉంటాయి. ఇవి శక్తివంతమైన ప్రోబయోటిక్స్‌గా పనిచేస్తాయి.

### జీర్ణ సమస్యలు తగ్గేందుకు..

అదనంగా ఫెర్మెంటేషన్ ప్రక్రియ వల్ల శరీరంలో పోషకాల శోషణ కూడా పెరుగుతుంది. అందువల్ల కాంజీని భోజనంతోపాటు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అంతేకాకుండా ఫెర్మెంటేషన్ వల్ల ఈ పానీయంలో మైక్రోన్యూట్రియెంట్స్ కూడా పెరుగుతాయని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. కాంజీ శరీరానికి చల్లదనాన్ని ఇవ్వడంతోపాటు శరీరాన్ని హైడ్రేట్ చేసే ఒక పానీయం. కనుక దీనిని వేసవిలో ఎక్కువగా తీసుకుంటారు. సరైన విధంగా ఫెర్మెంట్ అయిన కాంజీలో ఉండే ప్రోబయోటిక్స్ జీర్ణాశయ లైనింగ్‌ను బలపరచడంలో, జీర్ణాశయంలో వాపులను తగ్గించడంలో, జీర్ణాశయం అసౌకర్యాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. కాంజీ తయారీలో ప్రధానంగా ఉపయోగించే నల్ల క్యారెట్, మసాలాలు శరీరానికి హైడ్రేషన్‌తో పాటు జీర్ణాశయం ఆరోగ్యాన్ని కూడా అందిస్తాయి. అందువల్ల ఇది సహజ ఇమ్యూనిటీ బూస్టర్‌గా కూడా పనిచేస్తుంది.

### ఇన్‌ఫెక్షన్లకు చెక్..

కాంజీ ఒక ఆరోగ్యకరమైన పానీయం. అయితే దాన్ని సరైన విధంగా నిల్వ చేసి సరైన సమయంలో తీసుకుంటేనే పూర్తి ప్రయోజనం పొందవచ్చు. దీన్ని చల్లగా లేదా గది ఉష్ణోగ్రతలో తాగవచ్చు. కానీ ఎక్కువ వేడి తగిలితే పాడయ్యే అవకాశం ఉంది. ఇక కాంజీ తాగడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. వేసవిలో జీర్ణక్రియ మందగించి కడుపు ఉబ్బరం సమస్యలు రావచ్చు. కాంజీ వాటిని తగ్గించడంలో సహాయపడుతుంది. జీర్ణాశయం ఆరోగ్యంగా ఉంటే రోగనిరోధక కణాలు కూడా బలంగా పనిచేస్తాయి. అందువల్ల సీజనల్ ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. బయటి ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు శరీరాన్ని చల్లబరచి హీట్ ను తగ్గిస్తుంది. ఇలా కాంజీ ఎంతో సహాయపడుతుందని, వేసవి కాలంలో దీనిని తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని నిపుణులు తెలియజేస్తున్నారు.

### కాంజీ తయారీ ఇలా..


అలాగే ఇంట్లో కూడా సులభంగా కాంజీని తయారు చేసుకోవచ్చు. కాంజీని తయారు చేయడం చాలా సులభం. ముందుగా నల్ల క్యారెట్, ఆవాలు, నీరు సరైన నిష్పత్తిలో కలపాలి. ఈ మిశ్రమాన్ని శుభ్రమైన గాజు సీసాలో నిల్వ చేయాలి. సీసాను గట్టిగా మూసి సూర్యరశ్మిలో ఉంచాలి. కనీసం ఒక వారం పాటు ఫెర్మెంట్ అయ్యేలా ఉంచాలి. ఒక్కొక్కరి రుచి ఒక్కోలా ఉంటుంది కనుక మసాలాల నిష్పత్తిని వారి రుచికి అనుగుణంగా మార్చుకోవాలి. అయితే కాంజీ ఆరోగ్యానికి మేలు చేసేదే అయినప్పటికీ జీర్ణాశయ ఆరోగ్య సమస్యలు ఉన్న వారు వైద్యుల సలహా లేకుండా కాంజీని తాగకపోవడం మంచిది. ఆరోగ్యవంతులైనా ఎక్కువగా తాగితే జీర్ణక్రియ ఎక్కువగా జరిగి అసౌకర్యం కలగవచ్చు. కాబట్టి కాంజీని తీసుకోవడంలో మోతాదు, సమయం కూడా ముఖ్యమైనవి. మొత్తానికి కాంజీ ఒక సంప్రదాయ, తక్కువ ఖర్చుతో లభించే, ఆరోగ్యానికి ఉపయోగకరమైన పానీయం. వేసవిలో జీర్ణాశయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి కాంజీని తాగడం ఒక మంచి ఎంపిక అని చెప్పవచ్చు.

# ధురందర్-2 నుంచి ఆరి ఆరి పాట విడుదల

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్, సెన్సేషనల్ డైరెక్టర్ ఆదిత్య ధర్ కలయికలో తెరకెక్కిన భారీ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టిం చేందుకు సిద్ధమవుతోంది. ఈ క్రేజీ సీక్వెల్‌కు సంబంధించి అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'ఆరి ఆరి' సాంగ్‌ను చిత్రబృందంగురువారం విడుదల చేసింది. 2003 నాటి పాపులర్ బాంబే రాకర్స్ ÷ూటను శాశ్వత్ సచ్‌దేవ్ ఆధునిక బీట్స్‌తో రీమిక్స్ చేయగా, రణ్‌వీర్ సింగ్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఈ పాట విజువల్స్ అదరగొడుతున్నాయి. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ 310 మిలియన్లకు పైగా వ్యూస్‌తో రికార్డులు సృష్టించగా, తాజాగా విడుదలైన ఈ సాంగ్ సినిమాపై అంచనాలను మరింత రెట్టింపు చేసింది.దాదాపు రూ.400 కోట్ల భారీ బ్జడెట్‌తో రూపొందిన ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ జస్కిరాత్ సింగ్ రంగీ మరియు హమ్జా అనే రెండు విభిన్న పాత్రల్లో ద్విపాత్రాభినయం చేయబోతున్నాడు. అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, ఆర్ మాధవన్ వంటి అగ్ర నటులు కీలక పాత్రల్లో కనిపిస్తున్న ఈ చిత్రం భారత గూఢచారి వ్యవస్థ చుట్టూ సాగే హై-వోల్టేజ్ డ్రామాగా రూపొందింది. ప్రపంచవ్యాప్తంగా ఉగాది, ఈద్ పండుగల సందర్భంగా మార్చి 19, 2026న హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇక మార్చి 18 సాయంత్రం నుంచే భారీ ఎత్తున పెయిడ్ ప్రివ్యూలు ప్రదర్శించనుండగా, అడ్వాన్స్ బుకింగ్స్‌లో ఇప్పటికే ఈ చిత్రం 'స్త్రీ 2' రికార్డులను అధిగమించి ఆల్-టైమ్ రికార్డ్ దిశగా దూసుకుపోతోంది.




# ఉస్తాద్ ప్రచారంలో బిజీగా హరీష్ శంకర్





ప్రస్తుతం హరీశ్ శంకర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన ఈ చిత్రం మార్చి 19న భారీస్థాయిలో విడు దలకు సిద్ధమవుతోంది. దీనిప్రచా రంలో భాగంగా దర్శకుడు వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు. తాజాగా ఆయన మాట్లాడుతూ ఈ సినిమా ప్రీలుక్ పోస్టర్ విడుదలైన ప్పుడు వచ్చిన రూమర్స్‌పై స్పందిం చారు. ప్రీలుక్ పోస్టర్‌లో హీరో వెనక నుంచి తీసిన ఫొటో ఉండటంతో అందులో ఉన్నది పవన్ కల్యాణ్ కాదు, హరీశ్ శంకరే స్వయంగా డూప్‌గా నటించారనే వార్తలు వైరల్ అయ్యాయి. టీజర్ విడుదలైన తర్వాత కూడా కొందరు ప్రేక్షకులు ఆయనే డూప్‌గా నటించారని అన్నారు. దీనిపై ఆయన మాట్లాడుతూ.. తాను పవన్ కల్యాణ్‌కు ఎప్పుడూ డూప్‌గా నటించలేదని స్పష్టం చేశారు. ఆ రూమర్లు చూసి తాను బాధ పడలేదని, పవన్‌తో తనను పోల్చడం, తాను ఒక స్టార్ హీరోలా కనిపిస్తున్నానని జనం అనుకోవడం తనకు సంతోషాన్నిచ్చిందని సరదాగా అన్నారు. చిత్ర పరిశ్రమలో బాడీ డూప్‌ను ఒదుకు ఉపయోగిస్తారనే విషయంపై కూడా హరీశ్ శంకర్ వివరణ ఇచ్చారు. షూటింగ్ సమయంలో హీరోలకు చిన్న గాయం తగిలినా షూటింగ్ షెడ్యూల్స్ మొత్తం అస్తవ్యస్తమవుతాయని, దీనివల్ల నిర్మాతలకు కోట్ల రూపాయల నష్టం వస్తుందని ఆయన తెలిపారు. అందుకే హీరోల భద్రతను దృష్టిలోఉంచుకుని, రిస్క్ ఎక్కువగా ఉండే సన్నివేశాల్లోనే డూప్స్‌ను వాడతారని ఆయన వివరించారు.




## డిఫరెంట్‌గా దీవానా మూవీ టీజర్

టాలీవుడ్ యువ నటుడు హర్షిత్ రెడ్డి హీరోగా, స్నేహ మణిమేగలై హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం 'దీవాన'. ఈ చిత్ర టీజర్‌ను నేడు విడుదల చేశారు మేకర్స్. టీజర్ ఆరంభం నుంచి ముగింపు వరకు చాలా ఇంటెన్స్‌గా సాగింది. ఒక యువకుడు ప్రేమలో పడి, ఆ ప్రేమ కోసం ఏ స్థాయికైనా వెళ్లే 'దీవాన' గా ఎలా మారాడనేది ఈ చిత్ర ప్రధానాంశం. ముఖ్యంగా ఎంత అందంగా ఉంటే అంత సతాయిస్తారురా పోరీలు' మరియు 'అది నీ ప్రాణం పీక్క తినకపోతే నన్ను అడుగురా' వంటి డైలాగులు యువతను బాగా ఆకట్టుకుంటున్నాయి. తెలంగాణ అర్బన్ నేపథ్యంలో సాగే ఈ స్వచ్ఛమైన మరియు ఇంటెన్స్ లవ్ స్టోరీలో హర్షిత్ రెడ్డి తన నటనతో మరియు డైలాగ్ డెలివరీతో ఆకట్టుకున్నాడు.ఈ సినిమాకు శ్రీకాంత్ సంగిశెట్టి దర్శకత్వం వహించగా.. అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్స్‌లపై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి సంయుక్తంగా నిర్మిస్తున్నారు.





## స్పీడ్‌గా ఎన్టీఆర్ డ్రాగన్ షూటింగ్



ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్'. ఇటీవల జోర్డాన్‌లో కీలకమైన షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న చిత్ర యూనిట్, ఇప్పుడు తదుపరి యాక్షన్ వేట కోసం సిద్ధమైంది. జోర్డాన్ షెడ్యూల్‌లో హై-వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కించాడు ప్రశాంత్ నీల్. ఇక ఇప్పుడు నెక్స్ట్ షెడ్యూల్‌లో కూడా భారీ యాక్షన్ ఉండబోతుందని తెలుస్తోంది. కొత్త షెడ్యూల్ ఈ వారంలోనే హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని సమాచారం. ఇందుకోసం నగర శివార్లలోని ఒక ప్రముఖ స్టూడియోలో మూడు భారీ సెట్లను నిర్మించారట. ఇందులో విలన్ ఇంటికి సంబంధించిన సెట్ కూడా ఉందట. దాదాపు నెల రోజులకు పైగా సాగే ఈ లాంగ్ షెడ్యూల్‌లో.. సినిమాలోని కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారట. ఇక ఇక్కడ షూటింగ్ పూర్తయిన వెంటనే, చిత్ర యూనిట్ తదుపరి షెడ్యూల్ కోసం శ్రీలంక వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అక్కడ కూడా యాక్షనే ఉంటుందని టాక్. మొత్తంగా చూసుకుంటే.. డ్రాగన్ యాక్షన్ షెడ్యూల్సే ఎక్కువగా ఉన్నాయి. ఈ లెక్కన ప్రశాంత్ నీల్ ఏ రేంజ్ యాక్షన్ డోస్ ఇవ్వబోతున్నాడో అర్థం చేసుకోవచ్చు. ఈ సినిమాలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ అనిల్ కపూర్ మరియు మలయాళ నటుడు టోవినో థామస్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. 'కె.జి.ఎఫ్', 'సలార్' వంటి బ్లాక్ బస్టర్స్ తర్వాత ప్రశాంత్ నీల్ నుంచి వస్తున్న చిత్రం కావడంతో.. డ్రాగన్ పై అంచనాలు పీక్స్‌లో ఉన్నాయి.


## వృషకర్మ కోసం నాగచైతన్య కసరత్తులు



యువ హీరో నాగ చైతన్య ప్రస్తుతం హీరోగా తెరకెక్కుతున్న ఇంట్రెస్టింగ్ థ్రిల్లర్ చిత్రం వృషకర్మపై ఇప్పటికే మంచి ఆసక్తి నెల కొంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా మీనాక్షి చౌదరి నటిస్తుండగా, టాలెంటెడ్ దర్శకుడుకార్తీక్ వర్మ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'వృష కర్మ' గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో కూడిన ఈ సినిమా థియేటర్లలో సాలిడ్ ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తుందని మేకర్స్ హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఈ సినిమాలో నాగ చైతన్య పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించబోతుండటం అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. తాజాగా నాగ చైతన్య సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. ఆయన జిమ్‌లో తీసుకున్న ఒక ఫోటోను పోస్ట్ చేశాడు. ఆ ఫోటోలో చైతు 6 ప్యాక్ బాడీతో స్టైలిష్‌గా కనిపించడం అభిమానులను ఆశ్చర్యపరిచింది. డంబెల్స్ పట్టుకుని వర్కౌట్ చేస్తున్న ఫోటో ద్వారా ఈ సినిమా కోసం ఎంత కష్టపడుతున్నాడో చూపించాడు. ఇటీవల వచ్చిన తండేల్ సినిమాలో నాగ చైతన్య డీ-గ్లామరస్ లుక్‌లో కనిపించిన సంగతి తెలిసిందే. అయితే 'వృష కర్మ' కోసం మాత్రం పూర్తిగా స్టైలిష్ మరియు ఫిట్ లుక్‌లోకి మారడం విశేషంగా మారింది. నాగ చైతన్య ఈ ఫోటోలను షేర్ చేసిన కొద్ది నిమిషాల్లోనే సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యాయి. హీరో సుశాంత్ వంటి సెలబ్రిటీలు కూడా ఈ పోస్ట్‌పై స్పందించగా, వేలాది మంది అభిమానులు ÷ర్ ఎమోజీలు, లైక్స్‌తో కామెంట్స్ సెక్షన్‌ను హోరెత్తించారు. ఇదిలా ఉండగా నాగ చైతన్య సెట్స్‌కి సంబంధించిన మరికొన్ని ఫోటోలు కూడా షేర్ చేశారు. షూటింగ్ లొకేషన్స్‌లో తీసిన ఈ చిత్రాలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో 'వృష కర్మ' సినిమాపై అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది.

# తొలి పోరులో బెంగళూరుతో హైదరాబాద్ ఢీ!

**○ఐపీఎల్ 2026 సమరానికి షెడ్యూల్ ఖరారు**
**○డిఫెండింగ్ ఛాంపియన్‌తోనే ఆరంభం**
**○బెంగళూరు వేదికపై కొనసాగుతున్న సస్పెన్స్**



క్రికెట్ ప్రేమికులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్‌కు నగారా మోగింది. టాటా ఐపీఎల్ 2026 తొలి దశ షెడ్యూల్‌ను బీసీసీఐ బుధవారం విడుదల చేసింది. మార్చి 28 నుండి ఏప్రిల్ 12 వరకు జరగనున్న మొదటి దశలో మొత్తం 20 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. మూడు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున ఎన్నికల తేదీలు ప్రకటించిన తర్వాతే ఐపీఎల్ పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేస్తామని బోర్డు ప్రకటించింది. మార్చి 28న బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియం వేదికగా జరగనున్న ఆరంభ వేడుకల అనంతరం తొలి పోరు ప్రారంభం కానుంది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు , మాజీ ఛాంపియన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తొలి మ్యాచ్‌లో తలపడనున్నాయి. సొంత గడ్డపై ఆర్‌సీబీ బోణీ కొట్టాలని చూస్తుండగా, హైదరాబాద్ తమ సత్తా చాటేందుకు సిద్ధమైంది. మరుసటి రోజు ఆదివారం ముంబైలోని వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లు ఢీకొంటాయి. తొలి దశలో మొత్తం నాలుగు డబుల్ హెడర్ అంటే రోజుకు రెండు మ్యాచ్‌లు మ్యాచ్‌లు ఉన్నాయి. మధ్యాహ్నం మ్యాచ్‌లు 3:30 గంటలకు, రాత్రి మ్యాచ్‌లు 7:30 గంటలకు ప్రారంభమవుతాయి. ఏప్రిల్ 4న సీజన్‌లో తొలి డబుల్ హెడర్ జరగనుంది. ఆ రోజు మధ్యాహ్నం ఢిల్లీ వర్సెస్ ముంబై, రాత్రి గుజరాత్ టైటాన్స్ వర్సెస్ రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ సీజన్‌లో మ్యాచ్‌లు బెంగళూరు, ముంబై, గౌహతి, న్యూ చండీగఢ్, లక్నో, కోల్‌కతా, చెన్నై, ఢిల్లీ, అహ్మదాబా, హైదరాబాద్‌లలో జరగనున్నాయి. రాజస్థాన్ రాయల్స్ తమ తొలి హోమ్ మ్యాచ్‌లను గౌహతిలో ఆడనుంది. అక్కడ చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది. పంజాబ్ కింగ్స్ తమ హోమ్ మ్యాచ్‌లను న్యూ చండీగఢ్‌లోని పీసీఏ స్టేడియంలో ఆడుతుంది. ఆర్‌సీబీకి బెంగళూరుతో పాటు రాయ్‌పూర్ రెండో హోమ్ గ్రౌండ్‌గా ఉండగా, పంజాబ్ కింగ్స్ ధర్మశాలలో, రాజస్థాన్ రాయల్స్ జైపూర్‌లో కూడా తమ హోమ్ మ్యాచ్‌లను ఆడనున్నాయి. అయితే బెంగళూరులో జరగాల్సిన మ్యాచ్‌లు కర్ణాటక ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉన్నాయి. మార్చి 13న ఈ కమిటీ చిన్నస్వామి స్టేడియాన్ని సందర్శించి, మ్యాచ్ నిర్వహణకు ఏర్పాట్లు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలిస్తుంది. పూర్తిస్థాయి మాక్ డెమాన్‌స్ట్రేషన్ తర్వాతే బెంగళూరు వేదికపై తుది నిర్ణయం వెలువడనుంది.

# ఐపీఎల్ 2026 వాయిదాకే బీసీసీఐ మొగ్గు!

## ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం ప్రభావం

ఇండియన్ ప్రీమియర్ లీగ్ అభిమానులకు బ్యాడ్ న్యూస్! ఇరాన్ – ఇజ్రాయెల్ దేశాల యుద్ధం వల్ల ఇప్పుడు ఐపీఎల్ అర్ధాంతరంగా ఆగిపోయే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. పశ్చిమాసియాలోని యుద్ధం కారణంగా భారతదేశంలో ఇప్పుడు అనేక అవాంతరాలు ఏర్పడనున్నాయి. ఇప్పటికే గ్యాస్, ఇంధనం కొరత ఏర్పడం సహా ఇప్పుడు పరోక్షంగా అవి దేశంలోని వివిధ కార్యకలాపాలపై ప్రభావం చూపనున్నాయి. ఈ క్రమంలో ఐపీఎల్ వాయిదా పడొచ్చనే వార్తలపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఓ బిగ్ అప్‌డేట్ ఇచ్చింది. ఐపీఎల్ సరికొత్త సీజన్ 2026 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను బీసీసీఐ తాజాగా విడుదల చేసింది. ఇందులో టోర్నీలోని అన్ని మ్యాచ్‌లను కాకుండా కేవలం 20 మ్యాచ్‌లకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేయడం వల్ల అభిమానుల్లో అనేక రకాల పుకార్లకు తావిచ్చినట్లు అయ్యింది. ఐపీఎల్ 2026 టోర్నీ మార్చి 28న ఘనంగా ప్రారంభం కానుంది. కానీ, మరోవైపు ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధం తీవ్రరూపం దాల్చడం వల్ల ఐపీఎల్ సకాలంలో ప్రారంభం అవుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎందుకంటే యుద్ధ ప్రభావం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెటర్లు ఐపీఎల్‌లో పాల్గొనేందుకు అనేక సవాళ్లు ఎదుర్కొనే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. యుద్ధం కారణంగా ఇటీవలే టీ20 ప్రపంచకప్‌లో పాల్గొనేందుకు వచ్చిన వెస్టిండీస్, సౌతాఫ్రికా జట్లు రోజుల తరబడి భారతదేశంలోనే చిక్కుకుపోయారు. ఇప్పుడు తాజాగా స్వదేశానికి బయలుదేరారు. అంతేకాకుండా గ్యాస్ కొరత కారణంగా ప్రధాన నగరాల్లోని హోటళ్లు మూసివేత దిశగా పయనిస్తున్నాయి. అయితే భారతదేశంలో యుద్ధం ముప్పు తక్కువగా ఉన్నా.. విదేశాల నుంచి వచ్చే క్రికెటర్లు ప్రయాణ కష్టాలు.. యుద్ధం ఇలాగే కొనసాగితే హోటల్ కష్టాలు ఎదుర్కోక తప్పదనే వార్తలు వినిపిస్తున్నాయి. ఐపీఎల్ ఆగిపోతుందనే వార్తలపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా స్పందించారు. ఇప్పటికే ప్రకటించిన మార్చి 28 తేదీన ఐపీఎల్ ప్రారంభం అవుతుందని ఆయన ధ్రువీకరించారు. టోర్నీకి సంబంధించిన 20 మ్యాచ్‌ల షెడ్యూల్ విడుదల అయ్యిందని.. మిగిలిన మ్యాచ్‌లను రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం విడుదల చేసే తేదీలను బట్టి మిగిలిన టోర్నీ షెడ్యూల్‌ను నిర్ణయిస్తామని రాజీవ్ శుక్లా స్పష్టం చేశారు. యుద్ధం నేపథ్యంలో పరిస్థితులు తీవ్రంగా ఉన్నప్పటికీ.. ఐపీఎల్ ప్రారంభానికి ఇంకో రెండు వారాల సమయం ఉండడం వల్ల ఆ సమయానికి అంతా సర్దుకుంటాయని బీసీసీఐకి చెందిన మరో అధికారి ఆశాభావం వ్యక్తం చేశారు. హోటళ్లు, విమానయాన సంస్థలు, ఇతర అనేక విభాగాలు ఎలాంటి ఆందోళన చూపలేదని ఆయన తెలిపారు. అయితే ఈసారి ఐపీఎల్ నిర్వహణపై బీసీసీఐ పకడ్బంధీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# అర్ష్‌దీప్ సింగ్‌ను వెనకేసుకొచ్చిన గంభీర్..!



టీ20 వరల్డ్ కప్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్ మరియు మిచెల్ మధ్య జరిగిన వాగ్వాదంపై టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. అర్ష్‌దీప్ సింగ్.. మిచెల్‌కు క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదన్నాడు గంభీర్. మార్చి 8వ తేదీ, ఆదివారం రోజున అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 11వ ఓవర్‌ను.. భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్ వేశాడు. అప్పుడు క్రీజ్‌లో న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ ఉన్నాడు. ఇక అర్ష్‌దీప్ సింగ్ వేసిన రెండు బంతులను వరుసగా డారిల్ మిచెల్ సిక్సర్లుగా మలిచాడు. దీంతో అర్ష్‌దీప్ తీవ్ర అసహనానికి గురయ్యాడు. ఆ తరువాత వేసిన మూడవ బంతిని మిచెల్ షాట్ ఆడగా.. బాల్‌ను అర్ష్‌దీప్ ఆపాడు. వెంటనే బాల్‌ను వికెట్ల పైకి విసరకుండా మిచెల్ పైకి విసిరాడు. దీనిపై మిచెల్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఏంటి అన్నట్లుగా అర్ష్‌దీప్ సింగ్‌ను ప్రశ్నించాడు. అర్ష్‌దీప్ మాత్రం ఏమీ పట్టించుకోకుండా, కనీసం క్షమాపణ చెప్పకుండా తిరిగి తరువాత బంతిని వేసేందుకు వెళ్లిపోయాడు. అయితే.. టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాత్రం డారిల్ మిచెల్ వద్దకు వెళ్లి అతడికి సర్దిచెప్పాడు. అంపైర్ నచ్చజెప్పడంతో ఓవర్ పూర్తి కాగానే మిచెల్‌కు అర్ష్‌దీప్ సింగ్ క్షమాపణ చెప్పాడు. తాను కావాలని బంతిని విసరలేదని, బాల్ స్వింగ్ అయి మిచెల్‌ను తాకిందని, ఇందుకు అతడికి సారీ చెప్పినట్లు మ్యాచ్ అనంతరం అర్ష్‌దీప్ సింగ్ చెప్పాడు. అయితే ఈ విషయంపై టీమిండియా హెడ్ కోడ్ గౌతమ్ గంభీర్ మాట్లాడుతూ.. దేశం కోసం ఆడేటప్పుడు ఆటగాళ్లు దూకుడుగా ఉండటం సహజమని అన్నారు.

## హైదరాబాద్‌కు ఒకే ఒక్క హోమ్ మ్యాచ్ ఉండటం సమస్యే



టీమిండియా మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటేటర్ ఆకాశ్ చోప్రా ఐపీఎల్ 2026 ఫస్ట్ ఫేజ్ షెడ్యూల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఒకే ఒక్క హోమ్ మ్యాచ్ ఉండటం ఇబ్బంది కలిగించే విషయమేనని టీమిండియా మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటేటర్ ఆకాశ్ చోప్రా అన్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో పాటు గుజరాత్ టైటాన్స్‌కు కూడా ఒక్క హోమ్ మ్యాచ్ ఉందని తెలిపాడు. ఐపీఎల్ 2026 షెడ్యూల్‌ను బీసీసీఐ బుధవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. పలు రాష్ట్రాల్లో ఎన్నికల నేపథ్యంలో 20 మ్యాచ్‌ల షెడ్యూల్‌నే వెల్లడించింది. మార్చి 28 నుంచి ఈ క్యాష్ రిచ్ లీగ్‌కు తెరలేవనుండగా.. తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)తో సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్‌ఆర్‌హెచ్) తలపడనుంది. ఈ ఫస్ట్ ఫేజ్ షెడ్యూల్ ఆరెంజ్ ఆర్మీ మొత్తం 4 మ్యాచ్‌లు ఆడనుండగా.. ఇందులో ఒక్కటి మాత్రమే హైదరాబాద్ వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది. అయితే ఈ టోర్నీ ఆరంభంలోనే ఎక్కువ మ్యాచ్‌లు ఇతర వేదికల్లో ఆడాల్సి రావడం సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు సమస్యగా మారుతుందని చోప్రా అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ షెడ్యూల్ గురించి తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన ఆకాశ్ చోప్రా.. సన్‌రైజర్స్ మ్యాచ్‌ల గురించి కీలక వ్యాఖ్యలు చేశాడు. 'సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు బ్యాటింగ్‌కు అనుకూలించే ఫ్లాట్ పిచ్‌లు అవసరం. గత సీజన్‌లో సొంత మైదానంలో కూడా వారికి ఆశించిన పిచ్‌లు దక్కలేదు. ఈ సారి పరిస్థితి మరింత భిన్నంగా ఉంది. ఆరంభంలో కేవలం ఒకే ఒక మ్యాచ్ హోమ్ గ్రౌండ్‌లో ఆడనుంది. హైదరాబాద్ దూకుడుగా సీజన్ ప్రారంభించాలంటే మంచి బ్యాటింగ్ పిచ్ అవసరం. చిన్నస్వామిలో ఆ అవకాశం ఉంటుంది. కానీ, మొదటి నాలుగు మ్యాచ్‌ల్లో కేవలం ఒకే ఒక్క మ్యాచ్ హైదరాబాద్‌లో జరగడం.. అది కూడా మధ్యాహ్నం మ్యాచ్ కావడం ఆ జట్టుకు కొంత ఇబ్బంది కలిగించవచ్చు.ఒకవేళ ఆరంభంలో బయట మైదానాల్లో జరిగిన మ్యాచ్‌ల్లో హైదరాబాద్ రెండు విజయాలు సాధిస్తే.. ఆ తర్వాత వరుసగా హోమ్ గ్రౌండ్‌లో జరిగే మ్యాచ్‌లు వారికి ప్లస్ అవుతాయి. ఒకసారి ఊపు అందుకుంటే ప్లే-ఆఫ్స్‌కు వెళ్లడం సులవవుతుంది. కానీ ఆరంభంలో అవే మ్యాచ్‌ల్లో ఓడితే.. ఆ తర్వాత హోమ్ గ్రౌండ్‌లో కూడా ఒత్తిడి పెరిగి అది జట్టు ప్రదర్శనపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది.గుజరాత్ జట్టుకు కూడా ఆరంభంలో ఒకే ఒక హోమ్ మ్యాచ్ ఉంది. అయితే ఆ మ్యాచ్ సాయంత్రం ఉండటం వారికి కొంత ఊరటనిచ్చే అంశం. ఎందుకంటే మధ్యాహ్నం మ్యాచ్‌ల్లో పిచ్‌లు బ్యా టింగ్‌కు అంతగా సహకరించవు.'అని ఆకాశ్ చోప్రా చెప్పుకొచ్చాడు.

## టీ20 టీమ్ కెప్టెన్‌గా సంజూ శాంసన్..?



సొంతగడ్డపై టీ20 ప్రపంచకప్ గెలుపుతో టీమిండియా సంబరాల్లో మునిగిపోయింది. మూడుసార్లు టీ20 వరల్డ్ కప్ గెలిచిన తొలి జట్టుగా భారత్ నిలవగా.. సొంతగడ్డపై టైటిల్ గెలిచిన మొదటి జట్టుగా రికార్డు క్రియేట్ చేసింది. 2024 వరల్డ్ కప్ విజయం తరువాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి స్టార్లు రిటైర్‌మెంట్ ప్రకటనతో యువ జట్టు ఎలా ఆడుతుందో అని అనుమానాలు ఉన్నా.. అన్ని ఫటాపంచల్ చేస్తూ విశ్వవిజేతగా నిలిచింది. రోహిత్ శర్మ నుంచి టీ20 పగ్గాలు అందుకున్న సూర్యకుమార్ యాదవ్.. ఇప్పటివరకు ఒక్క సిరీస్ కూడా ఓడిపోని కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. ఆసియా కప్, టీ20 ప్రపంచకప్ గెలిపించిన కెప్టెన్‌గా నిలిచాడు. ఇక భవిష్యత్ ప్లానింగ్స్ గురించి ప్రస్తుతం చర్చలు మొదలయ్యాయి. ప్రస్తుతం సూర్యకుమార్ యాదవ్ 35 ఏళ్లు కాగా.. 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్, వచ్చే వరల్డ్ కప్ (2028) నాటికి సూర్యకు 37 ఏళ్లు వస్తాయి. అప్పటివరకు టీమ్‌లో ఉన్నా.. కెప్టెన్‌గా కొనసాగుతాడా లేదా అనేది అనుమానమే. ప్రస్తుతం ఉన్న టీమ్‌లో కెప్టెన్సీ రేసులో చాలామంది పేర్లు వినిపిస్తున్నాయి. ముందు వరుసలో మాత్రం సంజూ శాంసన్ పేరు మారుమోగిపోతుంది. టీ20 వరల్డ్ కప్ సూపర్-8 ఆఖరి మ్యాచ్ నుంచి ఫైనల్ మ్యాచ్ వరకు హ్యాట్రిక్ హాఫ్ సెంచరీలతో భారత్ విశ్వవిజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers,
RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609